పత్రికతో.. మార్పులు
APTEL/25/A1880
TN తెలుగు న్యూస్
దిన పత్రిక
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..
సంపుటి : 1 సంచిక : 704 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ మంగళవారం 01.09.2026 పేజీలు : 8 వెల : 4/-

# వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం
# నల్లమల గిరుల నుంచి పరుగులు పెట్టిన కృష్ణమ్మ

**పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

- 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న మూడు జిల్లాల ప్రజల కల సాకారం
- దోర్నాల వద్ద కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు, జలహారతి
- తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు
- ప్రారంభోత్సవానికి భారీగా హాజరైన రైతులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు




అమరావతి, ఆగస్టు 31 : ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల కల సాకారమైంది. పశ్చిమ ప్రకాశంలోని కరవు పీడిత ప్రాంతాలకు జీవనాడిగా భావిస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద ప్రాజెక్టు సొరంగాల నుంచి ఉరకలేస్తూ వచ్చిన కృష్ణా జలాలకు ఆయన భక్తిశ్రద్ధలతో జలహారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ చారిత్రక ఘట్టంతో ఆ ప్రాంత రైతులు, ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఈ సందర్భంగా గంటవానిపల్లె ఫీడర్ కెనాల్ వద్దకు చేరుకున్న **తరువాయి 2లో**



## విశాఖలో ఏఐజీ అడుగులు
### రూ.2,000 కోట్లు.. 1,000 పడకలు!

- విశాఖలో ఏఐజీ హాస్పిటల్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శంకుస్థాపన
- ఈ ప్రాజెక్టు ద్వారా 9 వేల మందికి ఉపాధి అవకాశాలు
- రెండు దశల్లో నిర్మాణం.. 2028 నాటికి తొలి దశ పూర్తి
- ఒకే క్యాంపస్‌లో వైద్య సేవలు, శిక్షణ, పరిశోధన కేంద్రాలు

ఆంధ్రప్రదేశ్ వైద్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. ఆసియాలోనే ప్రసిద్ధి గాంచిన ఏఐజీ (ఏఐజీ) హాస్పిటల్స్ ఇప్పుడు విశాఖపట్నంలో కొలువు **తరువాయి 2లో**

---

### అంతులేని యుద్ధం కాదు
## యుద్ధానికి ముగింపు కావాలి: పుతిన్‌తో మోదీ

- ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్‌కు మోదీ స్పష్టమైన సందేశం
- అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి ముగింపు వైపు వెళ్లాలన్న మోదీ
- శాంతియుత పరిష్కారాలకే భారత్ మద్దతు ఇస్తుందని వెల్లడి
- ఎస్‌సీఓ సదస్సు వేదికగా ఇరువురు నేతల భేటీ



- వచ్చే వారం భారత్‌కు రానున్న రష్యా అధ్యక్షుడు పుతిన్ **2లో**



### యూపీలో భారీ పేలుడు..
## 11 మంది దుర్మరణం

- యూపీలోని కౌశాంబిలో బాణసంచా ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం
- 11 మంది మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం NDRF, SDRF బృందాల సహాయక చర్యలు
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్‌గ్రేషియా **2లో**



## గ్యాస్ వినియోగదారులకు అలర్ట్
## నేడే ఆఖరు తేదీ!

- ఎల్‌పీజీ ఈ-కేవైసీకి నేటితో ముగియనున్న గడువు
- గతంలో ఈ-కేవైసీ చేసినవారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదు
- చేయని వారికి కనెక్షన్ తాత్కాలికంగా నిలిచే అవకాశం
- సబ్సిడీపై కూడా ప్రభావం పడే అవకాశం
- ఇంటి నుంచే యాప్‌ల ద్వారా ఈ-కేవైసీ చేసే వెసులుబాటు

**2లో**

## ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం




- విశాఖ జిల్లాలో నారా లోకేశ్ పర్యటన
- హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆలయాన్ని సందర్శించిన మంత్రి
- హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ
- ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజ్ భవనం ప్రారంభం
- జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌కు ప్రారంభోత్సవం

**2లో**

**పౌరసేవల్లో డేటా అనలటిక్స్.. పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం** **4లో**

## ఎయిరిండియాకు బాంబు బెదిరింపు..
## అత్యవసర ల్యాండింగ్

- దమ్మామ్-ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు
- అహ్మదాబాద్ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్
- టాయిలెట్‌లో 'బాంబ్' అని రాసి ఉన్న టిష్యూ పేపర్ లభ్యం
- ప్రయాణికులు, సిబ్బంది సురక్షితం, విచారణ చేపట్టిన అధికారులు



సౌదీ అరేబియాలోని దమ్మామ్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానానికి బాంబు బెదిరింపు రావడంతో కలకలం రేగింది. దీంతో విమానాన్ని గుజరాత్‌లోని అహ్మదాబాద్ సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించి, అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. సోమవారం ఉదయం 10:25 గంటలకు దమ్మామ్ నుంచి బయలుదేరిన ఈ విమానంలోని వాష్‌రూమ్‌లో 'బాంబ్' అని రాసి ఉన్న టిష్యూ పేపర్‌ను సిబ్బంది గుర్తించారు. వెంటనే వారు పైలట్‌ను అప్రమత్తం చేయడంతో, ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని సమీపంలోని అహ్మదాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు. సాయంత్రం 4:22 గంటల సమయంలో విమానం సురక్షితంగా **తరువాయి 2లో**

## సింధు జలాల ఒప్పందం
### మధ్యవర్తిత్వ కోర్టు తీర్పును తోసిపుచ్చిన భారత్

**2లో**

- ఆ కోర్టుకు తమపై ఎలాంటి అధికారం లేదని స్పష్టం
- కోర్టు ఏర్పాటు చట్టవిరుద్ధమని పేర్కొన్న విదేశాంగ శాఖ
- పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్
- తీర్పుతో తమ ప్రాజెక్టులపై ప్రభావం ఉండదని వెల్లడి



# ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం: మంత్రి నారా లోకేశ్

“ఒక వ్యక్తి చేసిన దానం.. నేడు వేల మందికి నీడనిచ్చే మహావృక్షంగా మారింది. సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఈ ప్రాంగణమే ఒక చక్కటి ఉదాహరణ” అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇవాళ విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో ఆయన పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనాన్ని, ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సంస్థకు సహకరిస్తున్న ముఖ్య దాతలతో బోర్డ్‌రూమ్ సమావేశంలో పాల్గొన్నారు.

**సేవే పరమావధిగా సాగిన జీవితం**

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. దివంగత ‘పద్మశ్రీ’ డాక్టర్ ఎస్.వి. ఆదినారాయణరావు గారు, వారి కుటుంబం సమాజ సేవ కోసం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆ భూమిలో నేడు కాలేజీ, హరేకృష్ణ మిషన్ ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమం, వృద్ధుల సంరక్షణ కేంద్రం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కొనియాడారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేస్తున్న ఈ రోజుల్లో, వృద్ధుల కోసం అత్యాధునిక కేర్ సెంటర్ నిర్మించడం గొప్ప విషయమని ప్రశంసించారు.

**విలువలతో కూడిన విద్యే లక్ష్యం**

“విద్యాశాఖ మంత్రిగా విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా, విలువలు, నైతికతతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత నాపై ఉంది. ‘అమ్మకి చెప్పలేని పని ఏదీ చేయొద్దు’ అనే బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి మాట ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం కావాలి. అందుకే ఆయనకు కేబినెట్ హోదాతో సలహాదారు బాధ్యతలు అప్పగించాం. ఆయన సూచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన పుస్తకాలను అందిస్తాం” అని లోకేశ్ వివరించారు. వృద్ధులు గౌరవంగా జీవించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలో ఎక్కడా లేని విధంగా వారికి రూ.4,000 పెన్షన్ అందిస్తున్నారని గుర్తు చేశారు.

**విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

విశాఖపట్నం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. “రాష్ట్ర విభజన తర్వాత విశాఖ అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లుగా విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను దేశంలోనే తొలి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మారుస్తాం. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో విశాఖను దేశంలోనే నంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతాం” అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను చంద్రబాబు అభివృద్ధి చేసిన తరహాలోనే విశాఖ అభివృద్ధిలోనూ కొత్త బెంచ్‌మార్క్ సృష్టిస్తామని అన్నారు.

* **అపోహలు వద్దు.. పర్యావరణ పరిరక్షణే ముఖ్యం**

అభివృద్ధి విషయంలో ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని లోకేశ్ అన్నారు. “ప్రజల ప్రయోజనాలకు, ప్రకృతికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం చేపట్టదు.

## విశాఖలో ఏఐజీ అడుగులు
# రూ.2,000 కోట్లు.. 1,000 పడకలు!

(మొదటిపేజీ తరువాయి)

దీరనుంది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ మెగా హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విశాఖ ఆనందపురం మండలం ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డితో కలిసి మంత్రి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

* **రూ.2,000 కోట్ల పెట్టుబడి, 9,000 ఉద్యోగాలు**

విశాఖలో నెలకొల్పనున్న ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కోసం ఏఐజీ యాజమాన్యం ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. నిర్మాణం పూర్తయితే వెయ్యి పడకల సామర్థ్యంతో ఇది ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద వైద్య కేంద్రాల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇది ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడగలదని అంచనా వేస్తున్నారు.
రెండు దశల్లో నిర్మాణం.. ప్రపంచ స్థాయి సేవలు
హాస్పిటల్ నిర్మాణాన్ని రెండు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశలో 650 పడకల సామర్థ్యంతో 2028 అక్టోబర్ నాటికి సేవలు ప్రారంభించాలని భావిస్తున్నారు. మిగిలిన 350 పడకలతో రెండో దశను ఆ తర్వాత రెండేళ్లలో పూర్తి చేస్తారు. మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో హాస్పిటల్ క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, 50కి పైగా వైద్య విభాగాలతో ప్రపంచ స్థాయి సేవలు అందించనున్నారు. కేవలం వైద్య సేవలే కాకుండా ఒకేచోట శిక్షణ, పరిశోధన, రోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సదుపాయాలతో ఒక సంపూర్ణ హెల్త్ కేర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయనున్నారు.

**ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం**

శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భూమి పూజ నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆసుపత్రి నిర్మాణ ప్రణాళికలు, భవిష్యత్ సేవలకు సంబంధించి రూపొందించిన ప్రత్యేక ఆడియో విజువల్ (ఏవీ)ను మంత్రి వీక్షించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గణబాబు, ఏఐజీ వైస్ ఛైర్మన్ పీవీఎస్ రాజు, డైరెక్టర్ జీవీ రావు, సీఈవో సామ్ రిజ్వీ, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చీ సహా పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# అంతులేని యుద్ధం కాదు.. యుద్ధానికి ముగింపు కావాలి: పుతిన్‌తో మోదీ

కిర్గిస్థాన్‌లోని బిష్కెక్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తన దౌత్యపరమైన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. “అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి స్వస్తి పలికే దిశగా అడుగులు వేయాలి” అని ఈ సందర్భంగా పుతిన్‌కు మోదీ సూచించారు. ఈ యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని యావత్ మానవాళి కోరుకుంటోందని ప్రధాని పేర్కొన్నారు. ఈ సంక్షోభ పరిష్కారానికి ఉద్దేశించిన ప్రతి శాంతియుత ప్రయత్నానికి భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. “ఏ సమస్యనైనా శాంతియుత మార్గాల్లోనే పరిష్కరించుకోవాలన్నదే భారత్ నిశ్చితాభిప్రాయం. ఇది సకల మానవాళి శ్రేయస్సుకు అత్యవసరం. యుద్ధం కొనసాగే ప్రతి రోజూ మానవ ప్రగతిని వెనక్కి నెడుతుంది. కాబట్టి దీనికి తక్షణమే ముగింపు పలకాలి” అని మోదీ వివరించారు. గాంధీ, బుద్ధుడు నడయాడిన భారత గడ్డ ఎల్లప్పుడూ శాంతి మార్గాన్నే బోధిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. 2022లో జరిగిన ఎస్‌సీఓ సదస్సులో “ఇది యుద్ధాల యుగం కాదు” అని పుతిన్‌తో మోదీ చేసిన చారిత్రాత్మక వ్యాఖ్యలకు కొనసాగింపుగానే తాజా సందేశం సాగింది. అటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ, ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ జరిపిన ప్రతి సంభాషణలోనూ చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం సాధ్యమని భారత్ నొక్కి చెబుతూ వస్తోంది.

# గ్యాస్ వినియోగదారులకు అలర్ట్ : నేడే ఆఖరు తేదీ!

గ్యాస్ కనెక్షన్ ఉన్నవారికి ఈకేవైసీ అంశం కీలకంగా మారింది. ఇండేన్, భారత్ గ్యాస్, హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. నేటితో (2026 ఆగస్టు 31) తుది గడువు ముగియనుంది. గతంలో ఉన్న ఆగస్టు 16 గడువును పొడిగించి ఈ తేదీని ఖరారు చేశారు. అయితే ఈ నిబంధన గతంలో ఈకేవైసీ పూర్తి చేయని నాన్ పీఎంయూవై వినియోగదారులకు వర్తిస్తుంది. ఈకేవైసీ ఇప్పటికే పూర్తి చేసినవారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదు. గడువులోగా పూర్తి చేయని వారికి గ్యాస్ సేవల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్యాస్ కనెక్షన్‌ను తాత్కాలికంగా నిలిపివేయొచ్చని సమాచారం. ఈకేవైసీ పూర్తి చేసిన తర్వాత కనెక్షన్‌ను తిరిగి యాక్టివేట్ చేస్తారు. కనెక్షన్ శాశ్వతంగా రద్దు చేయరు. ఈకేవైసీ పూర్తి చేయకపోతే దేశీయ ధరకు గ్యాస్ సిలిండర్ పొందడంలోనూ ఇబ్బందులు రావచ్చని ఇండియన్ ఆయిల్ గతంలో తెలిపింది. కొన్ని నివేదికల ప్రకారం.. ఈ ప్రక్రియ పూర్తి చేయని వారికి దేశీయ సిలిండర్ బదులు వాణిజ్య ధర చెల్లించాల్సి రావొచ్చు. అర్హత ఉన్న పీఎంయూవై లబ్ధిదారుల సబ్సిడీపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ ప్రక్రియను ఇంటి నుంచే పూర్తి చేయొచ్చు. ఇండేన్ వినియోగదారులు ‘ఇండియన్‌ఆయిల్ వన్’, భారత్ గ్యాస్ వినియోగదారులు ‘హలో బీపీసీఎల్’, హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ‘హెచ్‌పీ పే’ యాప్‌లను ఉపయోగించవచ్చు. ఆధార్ ముఖ గుర్తింపు కోసం ఆధార్‌ఫేస్ ఆర్‌డీ యాప్ అవసరం. యాప్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన తర్వాత ఈకేవైసీ ఆప్షన్ ఎంచుకుని ముఖ స్కాన్ ద్వారా ప్రక్రియను పూర్తి చేయాలి.

# సింధు జలాల ఒప్పందం: మధ్యవర్తిత్వ కోర్టు తీర్పును తోసిపుచ్చిన భారత్

సింధు నదీ జలాల ఒప్పందంపై హేగ్‌లోని అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టు వెలువరించిన తీర్పును భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ సార్వభౌమ నిర్ణయాలపై తీర్పు చెప్పే అధికారం ఆ కోర్టుకు లేదని సోమవారం స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ఘాటైన ప్రకటన విడుదల చేసింది. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రపంచ బ్యాంకు ఈ మధ్యవర్తిత్వ కోర్టును చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిందని భారత్ ఆరోపించింది. ఈ కోర్టును తాము ఎన్నడూ గుర్తించలేదని, దాని విచారణకు కూడా హాజరు కాలేదని తేల్చి చెప్పింది. “ఈ మధ్యవర్తిత్వ కోర్టుకు మా సార్వభౌమ నిర్ణయాల్లో జోక్యం చేసుకునే అధికారం ఏమాత్రం లేదు. ఇప్పుడు గానీ, భవిష్యత్తులో గానీ ఆ కోర్టు తీర్పులు మా చర్యలపై ఎలాంటి ప్రభావం చూపవు” అని విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దాడికి పాకిస్థాన్ కారణమని ఆరోపిస్తూ, ఆ దేశంపై తీసుకున్న కఠిన చర్యల్లో భాగంగా 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు కొనసాగినంత కాలం ఈ ఒప్పందం నిలిపివేతలోనే ఉంటుందని భారత్ స్పష్టం చేసింది. తాజా తీర్పుతో తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని, దేశీయంగా చేపడుతున్న జల ప్రాజెక్టులపై దీని ప్రభావం ఏమాత్రం ఉండదని పునరుద్ఘాటించింది.



# వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్వయంగా నీళ్లలోకి దిగి కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీర సమర్పించి హారతి ఇచ్చారు. అంతకుముందు, జలహారతి ప్రదేశానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి గిరిజన మహిళలు తమ సంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పండితులు ముఖ్యమంత్రికి శ్రీశైలం మల్లికార్జున స్వామి చిత్రపటాన్ని అందించి ఆశీర్వదించారు. నల్లమల కొండలను తొలుచుకుంటూ నిర్మించిన రెండు భారీ సొరంగాల నుంచి కృష్ణా జలాలు గంటవానిపల్లె ఆక్విడెక్టుకు చేరుకుని, అక్కడి నుంచి నల్లమల సాగర్ రిజర్వాయర్‌లోకి పరుగులు తీశాయి. ఈ దృశ్యాన్ని సభా ప్రాంగణం నుంచి వీక్షించిన మార్కాపురం రైతులు, మహిళలు పులకించిపోయారు. తమ ప్రాంతానికి కృష్ణమ్మ రావడంతో వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. ఈ చారిత్రక కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, డీబీవీ స్వామి, అనగాని సత్యప్రసాద్, పార్థసారథి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దశాబ్దాల నిరీక్షణకు కూటమి ప్రభుత్వం తెరదించిందని, ఇచ్చిన మాట ప్రకారం వెలిగొండను పూర్తి చేసిందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# యూపీలో భారీ పేలుడు.. 11 మంది దుర్మరణం

ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బాణాసంచా ఫ్యాక్టరీలో చెలరేగిన మంటలు వరుస పేలుళ్లకు దారితీయడంతో 11 మంది సజీవ దహనం అయ్యారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పిప్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మనౌరి బజార్‌లో జరిగిన ఈ దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. జిల్లా మేజిస్ట్రేట్ అమిత్ పాల్ శర్మ కథనం ప్రకారం, ప్రమాద సమాచారం అందిన వెంటనే అధికార యంత్రాంగం, పోలీసు బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యల కోసం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (NDRF), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (SDRF) బృందాలను రంగంలోకి దించారు. ఇప్పటివరకు 11 మృతదేహాలను వెలికితీసినట్లు ఆయన ధ్రువీకరించారు. గాయపడిన ఐదుగురిని మెరుగైన చికిత్స కోసం ప్రయాగ్‌రాజ్‌లోని స్వరూప్ రాణి నెహ్రూ (SRN) ఆసుపత్రికి తరలించారు. పేలుళ్ల తీవ్రతకు ఫ్యాక్టరీ భవనంతో పాటు సమీపంలోని కొన్ని నిర్మాణాలు కూడా కుప్పకూలాయి. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకొని ఉండవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ దుర్ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మేజిస్ట్రేట్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిందితులపై కఠినమైన సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, వారి ఆస్తులను జప్తు చేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన పలువురు ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమని అన్నారు. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి వర్గాలకు సూచించారు. ప్రమాద స్థలంలో బంధువులు తమ వారి కోసం శిథిలాల మధ్య వెతుకుతున్న దృశ్యాలు, ఆసుపత్రుల వద్ద ఆత్మీయుల సమాచారం కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు అక్కడి పరిస్థితికి అద్దం పట్టాయి.

## ఎయిరిండియాకు బాంబు బెదిరింపు..
# అత్యవసర ల్యాండింగ్

(మొదటిపేజీ తరువాయి)

ల్యాండ్ అయింది. ల్యాండింగ్ అనంతరం విమానాన్ని విమానాశ్రయంలోని ప్రత్యేక ప్రాంతానికి (ఐసోలేషన్ బే) తరలించారు. ప్రయాణికులను, సిబ్బందిని సురక్షితంగా కిందకు చేర్చి ప్రామాణిక భద్రతా ప్రోటోకాల్స్ ప్రకారం తనిఖీలు నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది, బాంబ్ నిర్వీర్యక దళాలు రంగంలోకి దిగి విమానం క్యాబిన్ సహా లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ప్రాథమిక తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గానీ, పేలుడు పదార్థాలు గానీ లభ్యం కాలేదని అధికారులు స్పష్టం చేశారు. అయినప్పటికీ భద్రతా సంస్థలు తనిఖీలను కొనసాగిస్తూ, ఈ బెదిరింపు వెనుక ఉన్న నిందితులను గుర్తించే దిశగా దర్యాప్తు ప్రారంభించాయి.

# ప్రపంచానికే ప్రళయం వచ్చినా.. ఈ దేశం తట్టుకుని నిలబడుతుంది!

(మొదటిపేజీ తరువాయి)

వల్ల సూర్యరశ్మి భూమికి చేరకపోవడం. రెండోది, భయంకరమైన సైబర్ దాడులు, మహమ్మారులు లేదా భూ అయస్కాంత తుపానుల వల్ల విద్యుత్, రవాణా, ఆహార వ్యవస్థలు కుప్పకూలడం. మూడోది, ఖండాలను నాశనం చేసే స్థాయిలో ప్రాణనష్టం కలిగించే జీవసంబంధమైన ముప్పులు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ కీలకమైన వ్యవస్థలను కాపాడుకుంటూ మానవ మనుగడను కొనసాగించగల సామర్థ్యం ఆస్ట్రేలియాకే ఎక్కువగా ఉందని ఈ అధ్యయనం పేర్కొంది.

**ఆస్ట్రేలియాకే ఎందుకంత శక్తి?**

ఆస్ట్రేలియా పలు కారణాల వల్ల ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. ఇది ఒక ద్వీప ఖండం కావడం వల్ల విపత్తు సమయంలో బయటి ప్రపంచంతో సంబంధాలను సులభంగా తెంచుకుని, తనను తాను కాపాడుకోగలదు. ఆహార ఉత్పత్తిలో దాదాపు స్వయం సమృద్ధి, బలమైన పారిశ్రామిక, మైనింగ్ రంగం, ఆర్థిక స్థిరత్వం, సుస్థిరమైన ప్రజాస్వామ్య పాలన వంటివి ఆ దేశానికి ప్రధాన బలాలుగా ఉన్నాయి. “భూమిపై అత్యంత స్థితిస్థాపకత కలిగిన ప్రదేశం ఆస్ట్రేలియా. అది ఒక ద్వీపం కావడం వల్ల తనను తాను వేరుచేసుకోగలదు. విపత్తుల్లో చిక్కుకునే ఇతర దేశాల ప్రభావం దీనిపై పడదు. ఆస్ట్రేలియాతో సరిహద్దులు పంచుకునే దేశాలేవీ లేవు. అక్కడ ఆహార ఉత్పత్తి చాలా ఎక్కువ, దేశీయంగా బలమైన పరిశ్రమలున్నాయి” అని ఈ పరిశోధన బృందానికి నేతృత్వం వహించిన ఫ్లోరియన్ ఉల్రిచ్ జెన్ వివరించారు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా తర్వాత న్యూజిలాండ్, జపాన్, స్విట్జర్లాండ్, అర్జెంటీనా దేశాలు నిలిచాయి. అయితే, స్విట్జర్లాండ్ మినహా మిగతా దేశాలకు సునామీలు, స్థానిక అగ్నిపర్వతాల నుంచి ముప్పు పొంచి ఉందని పరిశోధకులు తెలిపారు. అయితే, ఏ దేశానికీ సంపూర్ణ భద్రత లేదని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. ఇంధనం, మందులు, ఎరువుల వంటి కొన్ని అత్యవసరాల కోసం ఆస్ట్రేలియా కూడా అంతర్జాతీయ వాణిజ్యంపైనే ఆధారపడి ఉంది. ఈ అధ్యయనం కేవలం ఇతర దేశాలతో పోలిస్తే ఆస్ట్రేలియాకు ఉన్న సాపేక్ష భద్రతను మాత్రమే సూచిస్తుందని, నిజమైన ప్రపంచ విపత్తు సంభవిస్తే దాని ప్రభావం తీవ్రంగానే ఉంటుందని పరిశోధకులు తేల్చిచెప్పారు.

## సంపాదకీయం

# సామాన్యుడికి సంకెళ్లు..
# సంపన్నులకు రాయితీలు!

చాలామంది ఇల్లు కట్టుకోవాలని అనుకుంటారు, కానీ కట్టలేరు. ఇల్లు కట్టుకుందామని డబ్బులు దాచడం మొదలుపెట్టిన తరువాత, కట్టుకుందామని అనుకునే సమయానికి మనం దాచుకున్న మొత్తం కంటే రేట్లు పెరిగిపోతాయి. కాస్త బ్యాంక్ రుణం తీసుకుందామంటే, బ్యాంక్ వారు మనల్ని అడిగే పత్రాలు పుట్టించడం కంటే ఎన్నికల కమిషన్ వారు అడిగే పత్రాలు సమర్పించడం కొద్దిగా సులువు అనిపిస్తుంది. బ్యాంక్ వారు అడిగే పత్రాల పేర్లు మనం జన్మలో విని కూడా ఉండం. పొరపాటున ఏదో ఒక రకంగా కష్టపడి అవన్నీ సమర్పించి రుణం తీసుకున్నా మనశ్శాంతి ఉండదు. ఒక్కరోజు ఇన్‌స్టాల్‌మెంట్ కట్టడం ఆలస్యం అయితే మనకు ఫోన్ చేస్తారు. ఖర్మకాలి మనం ఫోన్ ఎత్తకపోతే, మనకు హామీగా సంతకం పెట్టిన వారికి ఫోన్ చేస్తారు. అప్పటికీ కూడా పొరపాటున మనం కట్టలేకపోతే కుటుంబ సభ్యులకు ఫోన్ చేస్తారు. అదృష్టం బాగాలేక ఒక నెల కట్టలేకపోతే రికవరీ ఏజెన్సీలకు అప్పగిస్తారు. ఇక రికవరీ ఏజెన్సీల అరాచకాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. వారు ఇంటికి వచ్చి పిల్లలు, పెద్దలు ఉన్నారని కూడా చూడరు; ఇరుగుపొరుగు వారికి కూడా వినిపించేలా అల్లరి చేస్తారు. గత సంవత్సరం నందిగామలో రికవరీ ఏజెన్సీ వచ్చి ఇంట్లో అల్లరి చేసిన తీరుకు, అప్పు కట్టలేకపోయినందుకు తండ్రిని వారు అన్న మాటలకు ఇంటర్మీడియట్ చదువుతున్న పాప ఆత్మహత్య చేసుకుని మరణించింది. రెండు లక్షల అప్పుకు, మూడు లక్షల అప్పుకు మనలాంటి మధ్యతరగతి వారిని ఇంత అల్లరి చేసి వసూలు చేసే రికవరీ ఏజెన్సీలను ప్రయోగించే బ్యాంకులు, అదానీలకు, అంబానీలకు అంత వెసులుబాటు ఎలా కల్పిస్తాయో అర్థం కాదు. ఒక మధ్యతరహా పరిశ్రమ పెట్టుకోవాలంటే బ్యాంకుల చుట్టూ తిరిగి రుణం పొందడానికి ఒక సంవత్సరం పడుతుంది. ఎలాగో వ్యాపారం మొదలుపెట్టాక అవసరానికి వర్కింగ్ క్యాపిటల్ పొందడం అనేది బ్రహ్మ ప్రళయం. వర్కింగ్ క్యాపిటల్ వచ్చింది అన్న ఆనందంతో చప్పట్లు కొట్టే సమయానికే అది కాస్త ఎన్.పి.ఎ. అవుతుంది. కానీ 37 కోట్ల స్థిరాస్తి మాత్రమే ఉన్న సుభాష్ చంద్ర అనే వ్యక్తి ఇచ్చిన గ్యారెంటీతో ఆయనకే చెందిన సంస్థలకు 20,006 కోట్ల అప్పు మంజూరు చేసిన సంస్థలు ఏవో తెలుసుకుని మనం కూడా రుణం కోసం వెళ్లామని ఎవరైనా అనుకుంటే పొరపాటే; కారణం మనకు రాజకీయ పలుకుబడి ఉండదు కాబట్టి.ఈ సుభాష్ చంద్ర అన్న వ్యక్తి 'జీ టీవీ' వ్యవస్థాపకులు. వారికి ఉన్న అనేక సంస్థలు తీసుకున్న బ్యాంకు రుణాలు వడ్డీతో కలిపి 20,006 కోట్ల లెక్క తేలింది. అంత అప్పు తీసుకున్న వారిలో చాలామంది చేసినట్లే సుభాష్ చంద్ర సంస్థలైన ఎస్సెల్ గ్రూప్ కూడా అప్పు కట్టలేక చేతులెత్తేసింది. వివాదం ఎన్.సి.ఎల్.టి. (NCLT)కి చేరింది. అప్పు ఇచ్చిన సంస్థలకు, ఎస్సెల్ గ్రూపునకు మధ్య వివాదంలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు దేశాన్ని నివ్వెరపరిచింది. 20,006 కోట్ల అప్పుకు గానూ సుభాష్ చంద్ర 6.5 కోట్లు చెల్లిస్తే సరిపోతుంది అని తీర్పు చెప్పింది. అందుకు కోర్టు చెప్పిన కారణం: సుభాష్ చంద్రకు ఉన్న వ్యక్తిగత ఆస్తులు మొత్తం కలిపి 31.79 కోట్లు మాత్రమేనని, అందులో ఆయన ఉండటానికి 25 కోట్ల రూపాయల ఖరీదు చేసే ఇంటిని తీసేస్తే, మిగిలిన నగదు పరిమితిని బట్టి ఆయన ఎంత చెల్లించగలరో అంతకు అనుగుణంగా 6.5 కోట్లు కాబట్టి అంతవరకే కట్టగలరు అని చెప్పింది. అంటే అప్పు తీసుకున్న వ్యక్తి ఉండటానికి మంచి ఇల్లు ఉండాలి అని న్యాయస్థానం భావించింది. ఈ కేసు మొత్తంలో మనకు అర్థం కానిది: ముప్పై కోట్ల ఆస్తి మాత్రమే ఉన్న వ్యక్తి హామీ ఇస్తే బ్యాంకులు అంత రుణాన్ని ఎలా మంజూరు చేశాయి అనేది మొదటి సందేహం అయితే; మనలాంటి వారు ఇల్లో వాకిలో తాకట్టు పెడితే వాటిని జప్తు చేసే బ్యాంకులు, సుభాష్ చంద్రకు ఇల్లు ఉండాలి అని అంత ఉదారంగా ఎలా ఒప్పుకున్నాయి అనేది రెండో సందేహం. సుభాష్ చంద్రకు అప్పు ఇచ్చిన సంస్థల్లో ప్రధానమైన సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ. ఈ సంస్థకు ఎస్సెల్ గ్రూప్ కట్టవలసిన మొత్తం బాకీ 1,322 కోట్ల రూపాయలు. అయితే బకాయిల వసూలు కోసం కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది మాత్రం ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ. అంటే బాకీ వసూలు కోసం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ హౌసింగ్ ఫైనాన్స్ చర్యలు చేపట్టడానికి కూడా మొహమాటపడింది. అంటే ప్రభుత్వ రంగ సంస్థ పెద్ద మనుషులకు రుణాలు ఇస్తుంది కానీ వసూళ్లకు మొహమాటపడుతుంది. ఇదే ఎల్ఐసి అదానీల సంస్థలో పెట్టిన పెట్టుబడుల పరిస్థితి ఏమిటో అనేది ఇప్పటి నుంచే ఆందోళనగా ఉన్నది. సుభాష్ చంద్ర రాజకీయ చరిత్ర చూస్తే లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎందుకు అంత మొహమాటపడిందో అర్థమవుతుంది. సుభాష్ చంద్ర 2016 లో హర్యానా నుండి రాజ్యసభకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయగా, భారతీయ జనతా పార్టీ ప్రత్యక్షంగానే మద్దతు పలికింది. ఆయన గెలుపు కోసం తన పలుకుబడిని కూడా ఉపయోగించింది. ఆయన విజయం చాలా నాటకీయంగా జరిగింది. కాంగ్రెస్ శాసనసభ్యులు వేసిన కొన్ని ఓట్లు తప్పు పెన్ను వాడారనే సాంకేతిక కారణంతో చెల్లవు అని నిర్ణయించి ఆయన గెలుపును ప్రకటించారు. తరువాత కూడా ఆయన రాజస్థాన్ నుండి రాజ్యసభకు పోటీ చేశారు, కానీ ఈ పర్యాయం తమ శాసనసభ్యులు చేయి జారిపోకుండా కాంగ్రెస్ పార్టీ జాగ్రత్త పడటం వలన ఓటమి పాలయ్యారు. అంతటితో రాజకీయాలకు స్వస్తి పలికి, ఈలోపుగా చుట్టూ ముట్టిన అప్పులను ఎలా ఎగ్గొట్టవచ్చు అనే ఆలోచనలో మునిగిపోయారు. సుభాష్ చంద్ర కేసులో వచ్చిన తీర్పుతో విజయ్ మాల్యా కూడా ఖంగుతిన్నారు. తాను కట్టవలసిన బకాయిలు ఐదు వేల కోట్ల రూపాయలు అయితే, బ్యాంకులు జప్తు చేసిన తన ఆస్తులు పద్నాలుగు వేల కోట్ల రూపాయలు అని ఆయన వాపోతున్నారు. గోవాలో ఉన్న ఆయన ఇంటిని ఇప్పటికీ బ్యాంకులు వేలం వేయలేకపోతున్నాయి, అది వేరే విషయం. ఇన్ని వేల కోట్ల అప్పులు ఎలా ఇస్తారో అర్థం కాదు; అప్పుల్లో 99.97 శాతం అప్పును ఎలా మాఫీ చేయించుకోవచ్చు అనేది సామాన్యుడికి అంతుచిక్కేది ఎలా? అంతదూరం వెళ్లనవసరం లేదు; సుభాష్ చంద్ర తీసుకున్న ఇరవై వేల ఆరు కోట్లు అనే దానిలో ఎన్ని సున్నాలు ఉంటాయో దేశంలో ఎంతమందికి తెలుసు? ఈ సుభాష్ చంద్ర ఎవరో దేశంలో కనీసం 139 కోట్ల మందికి తెలియదు. కానీ ఆయన చేసిన అప్పును మనమీద రుద్దాయి సంస్థలు. ఇటువంటి వాటి మీద స్పందించి ఆందోళనలు చేసే కమ్యూనిస్టులను కాదని, వారికి తమ పలుకుబడితో అప్పులు ఇప్పించడమే కాక ఎగ్గొట్టే అవకాశాన్ని కల్పించే పార్టీలకు ఓట్లు వేసి, తమ కష్టాన్ని తామే పెంచి పోషించుకుంటున్నారు ప్రజలు. దేశంలో పది శాతం మంది సంపన్నులు ఉంటే, అందులో కూడా బ్యాంకు రుణాలను అత్యధికంగా పొందేవారు ఒక్క శాతం కూడా ఉండరు. ఇన్ని కోట్ల మంది డబ్బులతో వ్యాపారాలు చేస్తూ, సామాన్యుడి ఊహకు కూడా అందని జీవనశైలితో జల్సాలు చేస్తూ, తిరిగి వారి అప్పులకు మనలను బాధ్యులను చేసే ఈ విధానం ఎప్పుడు పోతుందో ఎవరూ చెప్పలేరు. ఈ దేశం ఎటు పోతుందో ఎవరైనా చెప్పగలరా?

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 01

* 1896: ఎ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాద జననం (మ.1977). (చిత్రంలో)
* 1901: మొట్టమొదటి ప్రైవేటు తెలుగు గ్రంథాలయం శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం హైదరాబాదులో స్థాపించబడింది.
* 1945: నేత్రవైద్య నిపుణుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత గుళ్ళపల్లి నాగేశ్వరరావు జననం.
* 1947: భారతదేశ లోక్‌సభ సభాపతి పి.ఎ.సంగ్మా జననం (మ. 2016).
* 1973: భారతీయ టెలివిజన్ నటుడు రామ్ కపూర్ జననం.
* 1995: నారా చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ 19వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం.
* 1992: సాహితీవేత్త ఎస్. వి.జోగారావు మరణం (జ.1928).
* 2007: మన్యసీమ పక్షపత్రిక మొదటి ప్రతి ప్రచురించబడింది.


ఎ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాద



వెలిగొండ ప్రాజెక్టు వద్ద కృష్ణా నీళ్లను
## నెత్తిన చల్లుకుని, బాటిళ్లతో పట్టుకెళ్లిన జనం

- దశాబ్దాల వెలిగొండ ప్రాజెక్టు కల సాకారం
- నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- నీళ్లను నెత్తిన చల్లుకుని, బాటిళ్లలో నింపుకెళ్లిన ప్రజలు
- ప్రాజెక్టు ప్రారంభంతో మార్కాపురం జిల్లాలో వెల్లివిరిసిన సంబరాలు
- కరువు నేలపై కృష్ణమ్మ పరుగులు చూసి రైతుల ఆనందభాష్పాలు

అది కేవలం నీటి ప్రవాహం కాదు, దశాబ్దాలుగా కరవు నేల చూస్తున్న కల సాకారమైన క్షణం. అందుకే, పరుగులు పెడుతున్న కృష్ణమ్మను చూసి అక్కడికి వచ్చిన జనం కేవలం కేరింతలు కొట్టడమే కాదు, ఆ నీటిని చేతులతో తాకి భక్తితో కళ్లకద్దుకున్నారు. ఎంతో పవిత్రంగా భావిస్తూ తలపై చల్లుకున్నారు. కొందరైతే తాము తెచ్చుకున్న బాటిళ్లలో ఆ పుణ్య జలాలను నింపుకుని ఇళ్లకు పట్టుకెళ్లారు. మార్కాపురం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా కనిపించిన ఈ దృశ్యం, ఆ ప్రాంత ప్రజల గుండెల్లో కృష్ణా జలాలకు ఉన్న స్థానాన్ని, వారి నిరీక్షణ తీవ్రతను చెప్పకనే చెప్పింది. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్ 1ను ప్రారంభించారు. ఫీడర్ కెనాల్ గేట్లు ఎత్తి నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేయడంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా జల సంబరంతో పులకించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ కల కళ్లముందే ప్రవాహమై పరుగులెడుతుంటే, అక్కడికి తరలివచ్చిన రైతులు, మహిళలు, ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గేట్లు ఎత్తగానే కృష్ణమ్మ పరుగులు పెడుతుంటే, ప్రజల ఈలలు, కేరింతలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. చాలా మంది తమ సెల్‌ఫోన్లలో ఈ అపురూప దృశ్యాన్ని బంధించారు. తమ ప్రాంతానికి నీళ్లు వస్తాయో రావో అనే సందేహంతో బతికిన తాము, ఇప్పుడు కళ్లారా కృష్ణమ్మ పరవళ్లను చూస్తున్నామంటూ పలువురు రైతులు భావోద్వేగానికి గురయ్యారు. తమ జీవితాల్లో ఇదొక చారిత్రక మలుపు అని, తమ కరవు కష్టాలు తీరినట్టేనని ఆనందబాష్పాలతో తెలిపారు. సాధారణంగా సభ ముగియగానే జనం ఇళ్లకు వెళ్లిపోతారు. కానీ ఇక్కడ మాత్రం చాలాసేపటి వరకు ప్రజలు కాల్వ కట్టపైనే ఉండిపోయి, ప్రవహిస్తున్న కృష్ణమ్మను చూస్తూ మురిసిపోయారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం కేవలం ఒక కార్యక్రమంలా కాకుండా, మార్కాపురం జిల్లా ప్రజల గుండెల్లో నిలిచిపోయే ఒక మధుర జ్ఞాపకంగా, చరిత్రాత్మక ఘట్టంగా మారిపోయింది.





# పౌరసేవల్లో డేటా అనలటిక్స్.. పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం

- **రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష**
- **ప్రజల అభిప్రాయాలు, డేటా ఆధారంగా పౌరసేవలు మెరుగుపరచాలని సీఎం ఆదేశం**
- **పారిశుధ్యంపై రాజీ లేదని, సంక్షేమ హాస్టళ్లలో నెలకోసారి పేరెంట్స్ మీటింగ్ పెట్టాలని సూచన**
- **ప్రభుత్వ శాఖల సేవలు, ధ్రువపత్రాల జారీ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరగాలని నిర్దేశం**
- **వెలిగొండ తరహాలో ప్రతి కార్యక్రమంలో ప్రజా భాగస్వామ్యం పెంచాలని పిలుపు**
- **నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని సద్వినియోగం చేసుకోవాలని ఆదేశాలు**

ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, డేటా అనలటిక్స్‌ను విశ్లేషించడం ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే పౌరసేవలను మరింత మెరుగుపరచాలని, అవసరమైన మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో 'రియల్ టైమ్ గవర్నెన్స్' (ఆర్టీజీ)పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, అల్లూరి విమానాశ్రయం వంటి కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, ఇదే స్ఫూర్తిని ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ కొనసాగించి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు తాను 'స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో 20 సార్లు పాల్గొన్నానని గుర్తుచేశారు. ఇదే క్రమంలో



సంక్షేమ హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులను హాస్టళ్లకు ఆహ్వానించి, అక్కడి పరిస్థితులు, భోజనం, తాగునీటి సౌకర్యాలపై వివరించాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయన్నారు. అదేవిధంగా అన్నా క్యాంటీన్ల ద్వారా అన్నార్తులకు సాయం అందించే దాతలను గుర్తించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు తమ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అందించాలని చంద్రబాబు ఆదేశించారు. రెవెన్యూ సహా అన్ని విభాగాలు ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీకృత సేవల విధానం ద్వారా ప్రజలకు వేగంగా నిర్ణయాలు అందేలా చూడాలని అన్నారు. పనితీరు ఆధారంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బాధ్యులకు ర్యాంకులు ఇవ్వాలని, లోటుపాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని సరిదిద్దుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంలో 'అవేర్' (AWARE) వేదిక ద్వారా రాష్ట్రంలోని సాగు పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి, రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం చేసే రైతులను పూర్తిస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జగన్ ఎన్ని కుట్రలు చేసినా స్థానిక సంస్థల ఎన్నికలు ఆగవు: మంత్రి రవీంద్ర

మచిలీపట్నం: బీసీ రిజర్వేషన్లు, ఓటర్ల జాబితాపై కేసులు వేస్తుండటంపై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మచిలీపట్నంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైకాపా అధినేత జగన్ ఎన్ని కుట్రలు పన్నినా స్థానిక సంస్థల ఎన్నికలు ఆగవన్నారు. పాత ఓటర్ల



జాబితా ప్రకారమే ఎన్నికలకు వెళ్లనున్నట్లు చెప్పారు. ధైర్యం ఉంటే పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. స్థానిక ఎన్నికల విషయంలో జగన్‌ది ద్వంద్వ వైఖరి అని దుయ్యబట్టారు. ఏకగ్రీవాలను కూడా అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఆయన ఎన్ని కుట్రలు చేసినా తమను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నరన్నారు. రాష్ట్రంలోని అన్ని నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు.

## పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి: రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం, అటవీ, పర్యావరణశాఖల మంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పరిశ్రమలన్నీ పర్యావరణ నిబంధనలను తప్పక పాటించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను



చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీగ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

## ఏపీ మద్యం అక్రమ రవాణా కేసు.. సిట్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం

దిల్లీ: ఏపీలో మద్యం అక్రమ రవాణా కేసులో సిట్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రెండేళ్లుగా కేసు నడుస్తోందని, ఇంతవరకు ఏం కనుగొనలేదని పేర్కొంది. ముందుగా సిట్ తీరును ఎగ్జామిన్ చేసి.. ఆ తర్వాత హైకోర్టు తీర్పును పరిశీలిస్తామని తెలిపింది. రాజ్ కెసిరెడ్డి కేసులో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. రాజ్‌కెసిరెడ్డి పోలీస్ కస్టడీపై నిజంగానే సీరియస్‌గా ఉన్నారా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ పెండింగ్‌లో ఉండగా ప్రొడక్షన్ వారెంట్ అడిగారని, అప్పటికే కస్టడీలో ఉన్న వ్యక్తి పారిపోయే అవకాశమే లేదని పేర్కొంది. కస్టోడియల్ ఇంటరాగేషన్ కోరితే.. జడ్జి మీకు ప్రొడక్షన్ వారెంట్ ఇచ్చారు కదా అని కోర్టు అడిగింది. పోలీసు కస్టడీకి ప్రిపేర్ కాలేదు.. జ్యుడిషియల్ కస్టడీ ఇవ్వమంటున్నారు.. ఇదేం



ప్రవర్తన అని ప్రశ్నించింది. ప్రొడక్షన్ వారెంట్.. అరెస్ట్ వారెంట్‌తో సమానం పేర్కొంది. మరోవైపు ఏపీ మద్యం రవాణా కేసులో రాజ్ కెసిరెడ్డి, డి.వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణ ప్రక్రియలో నిబంధనలను సరిగ్గా పాటించలేదనే కారణంతో హైకోర్టు ఆదేశాలను ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీంతో తదుపరి విచారణను సీజేఐ ధర్మాసనం వాయిదా వేసింది.

## వెలిగొండపై మాటల యుద్ధం.. జగన్ కు లోకేశ్ కౌంటర్

- **వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం... టీడీపీ, వైసీపీ విమర్శల పర్వం**
- **నీళ్లు లేకుండానే జగన్ ప్రాజెక్టును ప్రారంభించారంటూ లోకేశ్ ఎద్దేవా**
- **తొలి దశ పూర్తి చేసి నల్లమల సాగర్‌లోకి నీటిని విడుదల చేసిన చంద్రబాబు**
- **తన తండ్రి, తన ఘనతేనంటూ ముందురోజు పోస్ట్ పెట్టిన జగన్**

ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని పలు వెనుకబడిన ప్రాంతాల దశాబ్దాల కలను సాకారం చేసే వెలిగొండ ప్రాజెక్టు, ఇప్పుడు తెలుగుదేశం, వైసీపీల మధ్య తీవ్ర రాజకీయ వివాదానికి కేంద్రంగా మారింది. మంత్రి నారా లోకేశ్.. వైసీపీ అధినేత జగన్ ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు చేశారు. ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడం తెలిసిందే. నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో, "ఆ విజువల్స్‌ను దగ్గరగా చూడండి" అంటూ కొన్ని ఫోటోలను పోస్ట్ చేశారు. "2024లో వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారు. నీళ్లు లేని ఒక నీటిపారుదల ప్రాజెక్టును ప్రారంభించారు. ఇలాంటి ఫేక్ ప్రారంభోత్సవం వైసీపీకే సాధ్యం!" అని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వం 2024 మార్చిలో సొరంగాలు పూర్తి చేసిన సందర్భంగా నీటి ప్రవాహం లేకుండానే ప్రారంభోత్సవం జరిపిందని, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం నిజంగా నీటిని విడుదల చేసిందని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, జగన్ నిన్న ఒక సుదీర్ఘ పోస్ట్‌లో వెలిగొండ ప్రాజెక్టు ఘనత తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డిది, తన ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కీలకమైన సొరంగాల పనులను తమ ప్రభుత్వమే పూర్తి చేసిందని, టీడీపీ హయాంలో పనులు నెమ్మదిగా సాగాయని విమర్శించారు. ఈ పోస్టుకు కౌంటర్‌గానే లోకేశ్ తాజా విమర్శలు చేశారు. సోమవారం ఉదయం ముఖ్యమంత్రి



చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించి, నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. తొలి విడతగా 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయడంతో, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు చెందిన సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది.

## విశాఖలో ఘోర ప్రమాదం.. కారులో సజీవదహనమైన డ్రైవర్

- **విశాఖ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం**
- **లారీని ఢీకొని కారులో చెలరేగిన మంటలు**
- **తప్పించుకునే అవకాశం లేక డ్రైవర్ సజీవదహనం**
- **నంబర్ ప్లేట్ ఆధారంగా మృతుడిని గుర్తిస్తున్న పోలీసులు**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం**



విశాఖపట్నం జిల్లాలో అత్యంత విషాదకరమైన రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆనందపురం పెందుర్తి సర్వీస్ రోడ్డులో ఓ కారు లారీని ఢీకొట్టిన అనంతరం మంటలు చెలరేగడంతో, వాహనంలో ఉన్న డ్రైవర్ సజీవ దహనమయ్యారు. ఈ హృదయ విదారక ఘటన గాంధ్రిగుండం పరిధిలోని సత్తారువు జంక్షన్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే, జాతీయ రహదారి 16 సర్వీస్ రోడ్డుపై అతివేగంగా వెళ్తున్న ఓ కారు, తన ముందున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి కారు ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే కారు మొత్తానికి అగ్నికీలలు వ్యాపించడంతో డ్రైవర్ బయటకు రాలేకపోయారు. వాహనం లోపలే చిక్కుకుపోయిన ఆయన, మంటల్లో కాలి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, వారు వచ్చేసరికే కారు పూర్తిగా కాలి బూడిదైంది. ఆనందపురం ఎస్ఐ శివ ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాద సమయంలో కారు నంబర్ ప్లేట్ ఊడిపోయి లారీకి అతుక్కుపోవడాన్ని పోలీసులు గుర్తించారు. ఆ నంబర్ ఆధారంగా మృతుని వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## రోశయ్య చరిత్ర తెలిసేలా మ్యూజియం

విశాఖపట్నం : రాజకీయ విలువలకు మానవ రూపం, నిజాయతీకి నిలువెత్తు ప్రతిరూపం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య అని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సోమవారం విశాఖలోని సిరిపురం సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అసెంబ్లీలో చంద్రబాబు, వైఎస్సార్ మధ్య ఎప్పుడైనా వాడీవేడిగా వాదన జరిగినప్పుడు రోశయ్య నిలబడి కాస్త చల్లబరిచేవారని గుర్తు చేసుకున్నారు. "రోశయ్య ఒక రాజకీయ పాఠశాల. నేటి తరానికి స్ఫూర్తి. నేటితరం బాల్యం నుంచే ఆయన జీవిత చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే పాఠ్యాంశాలలో రోశయ్య చరిత్ర, రాజకీయ విలువలు, సమాజ సేవ గురించి ఒక అధ్యాయం పెట్టించే బాధ్యత నాది. తెదేపా క్యాడర్ ట్రైనింగ్‌లో ఒక చాప్టర్ పెట్టించే బాధ్యత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తీసుకుంటారు. రోశయ్య చరిత్రపై పుస్తకాలు, ప్రత్యేక వీడియోలు రూపొందించి యువతకు చేరువ చేయాలి. వీటితోపాటు రోశయ్య చరిత తెలిపేలా ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఆర్యవైశ్య పెద్దలంతా ఆలోచించి మ్యూజియం కోసం స్థలం చూస్తే 18 నెలల్లో పూర్తి చేసి సీఎం చేతుల మీదుగా దేశానికి అంకితమిద్దాం" అని చెప్పారు.



# కేసీఆర్ కోసం ఇప్పటివరకు రూ.21 కోట్ల ఖర్చు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికాబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ''అంబర్‌పేటలో ఏ ప్రభుత్వ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయింది? మేం రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడున్న వాళ్లకు ఎలా ఉపయోగపడతాయి? అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా? ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితమైంది. ఎడ్ల సుధాకర్ మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ప్రజలు ఆలోచించాలి. హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదు. మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్కసారైనా ఒకటో తేదీన జీతాలు ఇవ్వకుండా ఉన్నామా? ఆనాడు పరిపాలన ఎలా ఉంది.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలి.

**కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి**

ఉస్మానియా ఆసుపత్రిని 2 వేల పడకలతో కడుతున్నాం. వచ్చే ఏడాదిలో ప్రారంభిస్తాం. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రిచెన్నారెడ్డి పేరు, అల్వాల్‌లో ఉన్న టిమ్స్‌కు టి.అంజయ్య పేరు, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు,



వరంగల్‌లో ఉన్న టిమ్స్‌కు ప్రొ.జయశంకర్ పేరు పెడతాం. బ్రిటిష్ హయాంలో 1931లో కులగణన చేస్తే.. 100 ఏళ్లలో మళ్లీ కులగణన చేసేందుకు ఈ దేశంలో ఏ నాయకుడు ధైర్యం చేయలేదు. జనగణన, కులగణన చేస్తారా లేదా గద్దె దిగుతారా అని తెలంగాణ సమాజం ప్రధాని మోదీకి సవాల్ విసిరింది. కేసీఆర్ 1000 రోజుల్లో కోటి 24 లక్షల 40 వేల రూపాయలు జీతం తీసుకున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే డిస్మిస్ చేస్తారు. మరి కేసీఆర్‌ను ఏం చేయాలి. ప్రతిపక్ష నాయకుడి హోదా ఉన్నందుకు ఆయనకు ఇన్నిరోజులు సెక్యూరిటీ, ఇల్లు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తదితర వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు ఖర్చు చేసింది. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా కోరుతూ ప్రజలు ఊరూరా ఆందోళనలు చేయాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువు పొడిగింపు

హైదరాబాద్: చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పెన్షన్ల కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఈ నెల 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులను ఆహ్వానించింది. నేటితో గడువు ముగియగా.. దరఖాస్తు చేయని వారు ఇంకా ఉండటంతో వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించింది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు.

## జలవనరుల జియోట్యాగింగ్ ద్వారా పారదర్శకత: ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్: కేంద్ర జల్‌శక్తి శాఖ సెప్టెంబర్ 1 నుంచి ఢిల్లీలో నిర్వహించనున్న సదస్సులో తెలంగాణ సమగ్ర జలభద్రత నమూనాను వివరించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా సుస్థిర జలవనరుల నిర్వహణకు సమన్వయంతో కూడిన కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో ఢిల్లీలోని భారత్ మండపంలో మంగళ, బుధవారాల్లో జాతీయ సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. సదస్సులో రాష్ట్రం తరపున సమర్పించనున్న ప్రజంటేషన్‌లో పొందుపరచాల్సిన అంశాలు, రాష్ట్రంలో అమలవుతున్న జలసంరక్షణ కార్యక్రమాలు, గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ, జలవనరుల జియోట్యాగింగ్, భూగర్భజలాల పర్యవేక్షణతో పాటు దేశవ్యాప్తంగా అనుసరించదగిన సమగ్ర జలభద్రత విధానంపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. దేశ జలభద్రతకు సంబంధించిన కీలక సవాళ్లపై కేంద్రం, రాష్ట్రాలు ఒకే వేదికపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేయనున్న నేపథ్యంలో ఈ సదస్సుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని మంత్రి పేర్కొన్నారు. జలవనరుల సంరక్షణ నుంచి ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా



వరకు వివిధ అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం సాధించేందుకు.. నిర్దిష్ట కాలపరిమితితో కూడిన జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని తెలిపారు. ఇదే వేదికగా తెలంగాణ సమగ్ర జలభద్రత నమూనాను వివరిస్తామని పేర్కొన్నారు. జలవనరుల జియోట్యాగింగ్ ద్వారా పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం కల్పించినట్లు వివరించారు. నిధుల వినియోగం, పనుల పురోగతిని పర్యవేక్షించడంతో పాటు భూగర్భజలాల పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. 28వేల చెరువుల మ్యాపింగ్‌తో 25 లక్షల 70 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 9.70 టీఎంసీల నిల్వ సామర్థ్యం పునరుద్ధరణ చేసినట్లు తెలిపారు. గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ పరిరక్షణకు దీర్ఘకాలిక ప్రణాళిక అమలు చేయనున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.



## సెప్టెంబర్ 2 నుంచి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ గ్రామీణం: బీఆర్ఎస్ బీ ఫారం మీద గెలిచి ప్రజల సమస్యల పరిష్కారానికి కేసీఆర్ నాయకత్వంలో పోరాడుతున్నట్లు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. కొందరిలా పార్టీ మారి తాను అమ్ముడు పోలేదని, దీనిపై ఎథిక్స్ కమిటీ ఆలోచన చేయాలని సూచించారు. హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కౌశిక్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెయ్యి రోజులు పూర్తి కావస్తున్నా నెరవేర్చలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. నియోజకవర్గంలో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

## కేసీఆర్‌పై సీఎం రేవంత్ విమర్శలు.. క్షమాపణ చెప్పాలన్న హరీశ్‌రావు

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అంబర్‌పేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, ఆ పార్టీ నేత హరీశ్‌రావు స్పందించారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో హరీశ్‌రావు పోస్టు చేశారు. ''మైకు దొరికిన ప్రతిసారీ కేసీఆర్‌పై అక్కసు వెళ్లగక్కడం, వ్యక్తిగత దూషణలకు దిగడం ద్వారా మీ స్థాయి ఏమాత్రం పెరగదు. 'నంది ఎవరో.. పంది ఎవరో' అన్న మాటలకు 1,000 రోజుల మీ పాలనే తేటతెల్లం చేస్తోంది. సీఎం స్థానంలో కూర్చుని ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తుంటే మీ రాజకీయ సంస్కారం, ఆలోచనా దౌర్భాగ్యం ప్రజలకు మరింత స్పష్టంగా అర్థమవుతున్నాయి. సీఎంగా ప్రజల కష్టాలను పట్టించుకోవాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. కానీ, మీ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రతిసారీ కేసీఆర్‌పై నిందలు మోపడం, దుర్భాషలాడటం ఏకైక అజెండాగా మారింది. ఈ డైవర్షన్



రాజకీయాలను తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తోంది. తెలంగాణ అస్తిత్వం కోసం ప్రాణాలను పణంగా పెట్టి, ఉద్యమాన్ని ఉద్ధృతం చేసి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెట్టిన ఉద్యమ రథసారథి కేసీఆర్. పదేళ్లపాటు సాగునీరు, నిరంతర విద్యుత్, రైతుబంధు, సంక్షేమం, సమగ్ర మౌలిక వసతులతో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన దార్శనికుడు. అలాంటి నాయకుడిపై నోరుపారేసుకోవడం చాలా సులభమే కావచ్చు.. కానీ, ఆయనలా తెలంగాణ కోసం నిబద్ధతతో పనిచేయడం, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడపడం వెయ్యి జన్మలెత్తినా మీ వల్ల కాదు. ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా.. ఎన్ని విమర్శలు గుప్పించినా.. ఎన్ని బూతులు మాట్లాడినా.. తెలంగాణ చరిత్ర నుంచి కేసీఆర్ పేరును, ప్రజల గుండెల్లోంచి ఆయన ముద్రను చెరిపివేయడం ఎవరి తరమూ కాదు. ఆరు గ్యారెంటీల పేరిట ఇచ్చిన హామీల అమలు ఎక్కడికి పోయింది? రైతుబంధు, పూర్తిస్థాయి రుణమాఫీ, మహిళలకు సంక్షేమం, నిరుద్యోగ భృతి వంటి అనేక వాగ్దానాలపై నేడు ప్రజలు రోడ్డెక్కి నిలదీస్తున్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం, మూసీ ప్రాజెక్టుల పేరుతో సాగిస్తున్న వివాదాలు, భూముల వ్యవహారాలపై వెల్లువెత్తుతున్న ప్రజాందోళనలకు జవాబు ఉందా? ఈ సమస్యలపై సమాధానం చెప్పలేక, రోజూ కేసీఆర్‌ని దూషిస్తే పాలనా వైఫల్యాలు మరుగున పడిపోవు. కేవలం తిట్లతో ప్రజల కడుపు నిండదు. విమర్శలతో వ్యవస్థాగత సమస్యలు పరిష్కారం కావు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై నిజాయతీగా దృష్టి పెట్టండి'' అని హరీశ్‌రావు దుయ్యబట్టారు.

## ఏం తప్పుచేశానని తిహాడ్ జైల్లో పెట్టారు..



నిజామాబాద్: 'ఏం తప్పుచేశానని నన్ను తిహాడ్ జైల్లో వేశారు. నాలుగేళ్ల పాటు ఈడీ, సీబీఐ అధికారులు సతాయిస్తే.. నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డ ఏ తప్పూ చేయలేదని చెప్పా. పార్టీ కోసమే జైలుకు పంపానని ఆనాడు పెద్ద నాయకులు అన్నారు. ఆడబిడ్డకు కష్టం వస్తే కడుపులో పెట్టుకుని చూసుకుంటారా? కర్కశంగా బయటకు పంపిస్తారా?' అని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగంతో కంటతడి పెట్టారు. నిజామాబాద్ పాత కలెక్టరేట్ మైదానంలో సోమవారం నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె మాట్లాడారు. 'సొంతగడ్డ కాబట్టి ఆపుకుందామన్నా కన్నీళ్లు ఆగడం లేదు. పిరికిదాన్ని కాదు.

* **వెయ్యి రోజులైనా.. ఒక్క హామీ నెరవేర్చలేదు?**

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన ముగిసినా 420 హామీల్లో ఒక్కదాన్నీ నెరవేర్చలేదు. సీఎం రేవంత్‌రెడ్డి తప్పించుకు తిరుగుతుంటే, ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం మౌనంగా ఉంటోంది. నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని కేసీఆర్ పెద్ద కొడుకులా భావించి భోజనం పెట్టారు. ఆయనేమో కేసీఆర్ పార్టీ ఓడిన రోజునే అమెరికాకు వెళ్లి.. ముకుంద్‌రెడ్డి, వేంనరేందర్‌రెడ్డితో మాట్లాడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. హరీశ్‌రావు, సంతోష్‌నైనా క్షమిస్తాను కానీ.. నన్ను, కేసీఆర్‌ను విడదీసిన ప్రశాంత్‌రెడ్డిని ఎప్పటికీ క్షమించను. నా ఉసురు తగులుతుంది. ఎమ్మెల్యే కాకముందు.. ఆ తర్వాత ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డిల ఆస్తి ఏమిటో చూడండి. ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌ల అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలెందుకు తీసుకోవడం లేదో చెప్పాలి. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం కింద నిజామాబాద్ జిల్లాలో ఒక ఎకరమైనా తడవడం లేదు. భారాస హయాంలో నాలుగైదు ఇళ్లే బంగారు తెలంగాణగా మారాయి. బోధన్ చక్కెర కర్మాగారాన్ని కేటీఆర్ స్నేహితుడు, కోరుట్లకు చెందిన ఎమ్మెల్యే కొంటారని నాకు తెలిసింది. వాస్తవానికి రూ.18 కోట్లు ఇస్తే కర్మాగారం కార్మికులకు ఇళ్లు వస్తాయని చెప్పినా నాడు కేటీఆర్ వినలేదు. ఏడేళ్లుగా స్థానిక ఎంపీ ధర్మపురి అర్వింద్ కనీసం మాధవనగర్ రైల్వే వంతెనను పూర్తిచేయించలేదు. అప్పట్లో నేను కేకే ట్యాక్స్ తీసుకుంటున్నానని ఆరోపించారు. ఇప్పుడు మీరేం ట్యాక్స్ తీసుకుంటున్నారు' అని కవిత ప్రశ్నించారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అలీమ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌కు ప్రఖ్యాత విదేశీ విద్యాసంస్థలు

* **సీఎంకు ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం నివేదిక**

హైదరాబాద్: అమెరికా, బ్రిటన్‌లకు చెందిన ప్రఖ్యాత విదేశీ విద్యాసంస్థలు తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సంబంధిత వివరాలతో కూడిన ప్రత్యేక నివేదికను అమెరికా, బ్రిటన్‌లలో పర్యటించిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేసింది. నివేదికను స్వీకరించిన అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా.. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యానికి ఈ విదేశీ పర్యటన, అంతర్జాతీయ వర్సిటీల భాగస్వామ్యం ఊపిరి పోసిందని హర్షం వ్యక్తం చేశారు. మన రాష్ట్ర విద్యార్థులకు, యువతకు హైదరాబాద్‌లోనే ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్య, నైపుణ్యాలు అందేలా రూపుదిద్దుకుంటున్న ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు తానే స్వయంగా నాయకత్వం వహిస్తానని సీఎం ప్రకటించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో గ్లోబల్ నాలెడ్జ్ హబ్ ఏర్పాటైతే.. మరిన్ని ప్రపంచస్థాయి మల్టీనేషనల్ కంపెనీలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు తెలంగాణకు తరలివస్తాయన్నారు. రాబోయే డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్'లో ప్రపంచ విద్యాసంస్థల భాగస్వామ్యం, క్రీడారంగాభివృద్ధిపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉన్నతస్థాయి అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డా.ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ ఛైర్‌పర్సన్ ఎ.శాంతికుమారి, సీఎం సలహాదారు కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీధర్ ఉన్నారు.

**నివేదికలోని ముఖ్యాంశాలు..**

అమెరికాలోని అత్యుత్తమ 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ'తో పాటు.. బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన 'యూనివర్సిటీ ఆఫ్ లండన్'.. భారత్‌లోనే తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు స్పష్టమైన అంగీకారం తెలిపాయి. ముఖ్యంగా నార్త్ ఈస్టర్న్ వర్సిటీ తమ క్యాంపస్‌ను 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేసే అవకాశాలను ముమ్మరంగా పరిశీలిస్తోంది. ప్రపంచంలోనే



అగ్రగామిగా నిలిచే 'హార్వర్డ్ యూనివర్సిటీ'.. హైదరాబాద్‌లోని డా.ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వేదికగా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ రంగ ప్రతినిధుల కోసం ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను నిర్వహించేందుకు పచ్చజెండా ఊపింది. ఈ కోర్సులు నవంబరు నుంచే నగరంలో ప్రత్యక్షంగా ప్రారంభం కానున్నాయి. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్'.. 'స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్'.. 'ఆక్స్‌ఫర్డ్'.. 'కేంబ్రిడ్జ్'.. 'మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'.. 'లండన్ బిజినెస్ స్కూల్'.. 'వర్జీనియా టెక్'.. 'ఇంపీరియల్ కాలేజ్ లండన్'.. వంటి దిగ్గజ విద్యాసంస్థల అధిపతులతో విస్తృతస్థాయి చర్చలు జరిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటుపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ సంస్థల నిపుణుల బృందాలు త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించి ప్రత్యక్షంగా ఇక్కడి వసతులను పరిశీలించనున్నాయి.

## మెస్సి రిటైర్మెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి పోస్టు

హైదరాబాద్: ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలకడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. ''ప్రియమైన మెస్సి.. మీరు యావత్ ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఉర్రూతలూగించారు.. ఎంతగానో అలరించి, ఉత్తేజపరిచారు.. స్ఫూర్తినిచ్చారు. హైదరాబాద్‌లో మీతో కలిసి ఫుట్‌బాల్ మైదానంలో కాసేపు గడపడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. మెస్సి లేని ఫుట్‌బాల్ ఇకపై మునుపటిలా ఉండదు. వీడ్కోలు.. మీ స్ఫూర్తి ఇలాగే కొనసాగాలి'' అని సీఎం పేర్కొన్నారు. అలాగే, మెస్సి పెట్టిన వీడ్కోలు పోస్టుతో



పాటు కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో మెస్సితో కలిసి మైదానంలో సందడి చేసిన ఫొటోను షేర్ చేశారు.

# ఉత్తరాఖండ్‌కు కొత్త ముప్పు: 219 'వేలాడే' హిమానీనదాలు!

- ఉత్తరాఖండ్‌లో 219 'వేలాడే' హిమానీనదాలను గుర్తించిన పరిశోధకులు
- వీటిలో మూడో వంతు మంచు అస్థిరంగా ఉందని అధ్యయనంలో వెల్లడి
- ఈ గ్లేసియర్లు కూలితే భారీ వరదలు, విపత్తులు సంభవించే ప్రమాదం
- వాతావరణ మార్పుల వల్లే ఈ ముప్పు పెరుగుతోందని నిపుణుల ఆందోళన



హిమాలయ రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో ప్రకృతి విపత్తులకు దారితీసే మరో పెనుముప్పు పొంచి ఉందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. రాష్ట్రంలోని గర్వాల్ హిమాలయాల్లో ఏకంగా 219 'వేలాడే హిమానీనదాలు' (హ్యాంగింగ్ గ్లేసియర్స్) ఉన్నాయని, వాటిలో మూడో వంతు మంచు నిల్వలు అత్యంత అస్థిరంగా ఉన్నాయని ఈ పరిశోధన తేల్చింది. ఈ వివరాలు అంతర్జాతీయ సైన్స్ జర్నల్ 'నేచురల్ హజార్డ్స్'లో ప్రచురితమయ్యాయి.సాధారణంగా లోయల్లో ఉండే హిమానీనదాలతో పోలిస్తే, నిటారుగా ఉండే కొండ వాలులపై ఉండే ఈ 'వేలాడే హిమానీనదాలు' చాలా బలహీనంగా ఉంటాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో హిమాలయ ప్రాంతం వేగంగా వేడెక్కుతుండటంతో, ఇవి ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ అధ్యయనం ప్రకారం, ఉత్తరాఖండ్‌లో గుర్తించిన 219 హిమానీనదాల మొత్తం 2.39 క్యూబిక్ కిలోమీటర్లు మంచు ఉండగా, అందులో 0.74 క్యూబిక్ కిలోమీటర్ల మేర మంచు అస్థిరంగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో 2013లో కేదార్‌నాథ్, 2021లో చమోలీ, 2023లో సిక్కింలో సంభవించిన పెను విపత్తులకు ఇలాంటి హిమానీనదాల విస్ఫోటనాలే ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం ఫలితాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ సహకారంతో అత్యంత ప్రమాదకరమైన 13 హిమనద సరస్సులపై నిరంతర నిఘా ఉంచింది.

## నేపాల్‌కు కేపాప్ స్టార్ లీ నో భారీ విరాళం

- సుమారు రూ.69 లక్షల సాయం ప్రకటించిన కొరియన్ సింగర్
- ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు కోటి రూపాయల విరాళం
- వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన 77 మంది యాత్రికులు గల్లంతు



నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న వరద బాధితులను ఆదుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. ప్రముఖ దక్షిణ కొరియా పాప్ (కేపాప్) బ్యాండ్ 'స్ట్రే కిడ్స్' సభ్యుడు లీ నో తన ఉదారతను చాటుకున్నారు. వరద సహాయక చర్యల నిమిత్తం 100 మిలియన్ల కొరియన్ వన్‌లు (భారత కరెన్సీలో సుమారు రూ. 69 లక్షలు) విరాళంగా ప్రకటించారు. 'వరల్డ్ విజన్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా లీ నో మాట్లాడుతూ, "ఈ కష్టకాలంలో నేపాల్‌కు నా వంతు సహాయం అందించాలని నిర్ణయించుకున్నాను. ఆ దేశ ప్రజలు ఈ విపత్తు నుంచి వీలైనంత త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను" అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లీ నో 2014 నుంచి వరల్డ్ విజన్‌తో కలిసి పనిచేస్తూ ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గతంలో ఆహార సంక్షోభం, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి కోసం కూడా లీ నో భారీగా విరాళాలు అందజేశారు. మరోవైపు, భారతీయ ఆధ్యాత్మిక గురువు, ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్ సైతం నేపాల్‌కు తనవంతు సాయాన్ని ప్రకటించారు. నేపాల్ ప్రధానమంత్రి సహాయ నిధికి ఆయన రూ. 1 కోటి విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. కాగా, నేపాల్ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన 77 మంది యాత్రికులు గల్లంతవడం తెలిసిందే.

## అమెరికాతో ఉద్రిక్తతలు: భారత్ సాయం కోరిన ఇరాన్ అధ్యక్షుడు

- ప్రధాని మోదీతో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ప్రత్యేక భేటీ
- ఉద్రిక్తతలు తగ్గించడానికి భారత్ తన పలుకుబడిని ఉపయోగించాలని విజ్ఞప్తి
- శాంతి స్థాపనకు కృషిని ముమ్మరం చేయాలని నేతల నిర్ణయం
- కష్టకాలంలో అండగా నిలిచినందుకు భారత్‌కు ఇరాన్ ధన్యవాదాలు



అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్న ఇరాన్‌అమెరికా వివాదం పరిష్కారానికి భారత్ చొరవ చూపాలని ఇరాన్ నాయకత్వం అభ్యర్థించింది. కిర్గిజ్‌స్థాన్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (SCO) సదస్సు సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ తనకున్న దౌత్యపరమైన సంబంధాలను ఉపయోగించాలని ఆయన మోదీని కోరారు. ఈ సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ.. కష్టకాలంలో తమకు అండగా నిలుస్తున్నందుకు భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా దౌత్య మార్గాన్ని విడనాడి యుద్ధ మార్గాన్ని ఎంచుకుందని, ఆ దేశంలోని కొన్ని శక్తులు ఈ వివాదం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. చర్చలు, పరస్పర సహకారంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్న ఆయన, ఇతర దేశాలు యుద్ధం వైపు వెళ్లకుండా నిరోధించేందుకు భారత్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రధానమంత్రి మోదీ స్పందిస్తూ, క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇరాన్‌తో భారత్ తన దృఢమైన సంబంధాలను కొనసాగించిందని గుర్తుచేశారు. పెజెష్కియాన్‌ను శాంతికాముకుడిగా అభివర్ణించిన మోదీ, శాంతి స్థాపనలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కొందరు యుద్ధం ద్వారా లబ్ధి పొందాలని చూస్తారన్న విషయాన్ని అంగీకరిస్తూనే, శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని, తుదకు శాంతే విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధిలోని లారక్ ద్వీపంలో ఇరాన్ లాంచర్లపై అమెరికా దాడి చేయడం, దానికి ప్రతిచర్యగా జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించిన మరుసటి రోజే ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. బాహ్య ఒత్తిళ్లు ఉన్నప్పటికీ రవాణా, సముద్రయాన రంగాల్లో భారత్‌తో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ స్పష్టం చేసింది.

## 'పది'తో తపాలా శాఖలో 23,757 ఉద్యోగాలు.. రిజిస్ట్రేషన్లు షురూ!




తపాలా శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలైంది. అర్హులైన, ఆసక్తికలిగిన అభ్యర్థులు ఎవరైనా నేటి (ఆగస్టు 31) నుంచి సెప్టెంబర్ 19వరకు ఆన్‌లైన్ ఓటీఆర్ (One Time Registration) చేసుకొనేందుకు పోస్టల్ శాఖ అధికారులు అవకాశం కల్పించారు. దేశ వ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) పోస్టుల భర్తీకి సెప్టెంబర్ 2 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం కల్పించారు. సెప్టెంబర్ 23, 24 తేదీల్లో దరఖాస్తుల్లో పొరపాట్లు సవరించుకోవచ్చు. దరఖాస్తు రుసుం రూ.100. మహిళలు, ఎస్సీ/ఎస్టీ, దివ్యాంగులకు దరఖాస్తు రుసుం నుంచి మినహాయింపు ఇచ్చారు.

**పరీక్ష లేదు.. వేతనం ఎంతంటే?**

బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్/డాక్‌సేవక్ పోస్టులకు ఎలాంటి రాత పరీక్ష ఉండదు. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఈ నియామకాలు చేపట్టనున్నట్టు తపాలా శాఖ అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష ఉండటం తప్పనిసరి. అలాగే,అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు సైకిల్ తొక్కడం రావాలి. ఆ ఉద్యోగాలను బట్టి బీపీఎంకు వేతన శ్రేణి రూ.12 వేలు రూ.29,380; ఏబీపీఎం/డాక్ సేవక్‌కు రూ.10వేలు 24,470గా నిర్ణయించారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకొనే అభ్యర్థుల వయసు 1840 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు చొప్పున గరిష్ఠ వయసులో సడలింపు ఉంది.

*** తెలుగు రాష్ట్రాల్లో భర్తీచేసే ఉద్యోగాలెన్నంటే..?**

దేశ వ్యాప్తంగా అన్ని పోస్టల్ సర్కిళ్లలో కలిపి మొత్తంగా 23,757 ఉద్యోగాలను భర్తీ చేస్తుండగా.. ఏపీ సర్కిల్‌లో 917, తెలంగాణ సర్కిల్‌లో 419 పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారు రోజుకు దాదాపు నాలుగు గంటల పాటు పనిచేస్తే సరిపోతుంది. అలాగే, వీటితోపాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు(IPPB)కు సంబంధించిన సేవలకు గానూ ప్రత్యేకంగా ఇన్సెంటివ్ రూపంలో బీపీఎం/ ఏబీపీఎం/ డాక్ సేవక్‌లకు ప్రోత్సాహకాలు అందిస్తారు. వీరు రోజువారీ విధులు నిర్వర్తించడానికి ల్యాప్‌టాప్/ కంప్యూటర్/ స్మార్ట్ ఫోన్ లాంటివి తపాలా శాఖ సమకూరుస్తుంది.

## ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ.. యుద్ధం తర్వాత తొలిసారి ముఖాముఖి చర్చలు



కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఫిబ్రవరిలో ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత మోదీ, పెజెష్కియాన్ ముఖాముఖిగా సమావేశం కావడం ఇదే తొలిసారి. ఇరువురు నేతలు ఏ అంశాలపై చర్చించారనే విషయం పూర్తిగా వెల్లడికాలేదు. అయితే హర్మూజ్ జలసంధిపై ఇరాన్ విధించిన దిగ్బంధం చర్చల్లో ప్రస్తావనకు వచ్చి ఉండొచ్చని తెలుస్తోంది. కిర్గిజిస్థాన్ పర్యటన తొలి దశలో మోదీతో పెజెష్కియాన్ సమావేశమై చర్చలు జరిపినట్లు భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం తెలిపింది. బిష్కెక్ బయలుదేరే ముందు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని చెప్పారు. అయితే తమపై జరిగే దాడులకు బలంగా, దృఢంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. తమ ప్రాంతంలో అస్థిరత అన్ని దేశాలకు నష్టమేనని అన్నారు. ఆర్థిక, భద్రతా లక్ష్యాల కోసం దేశాల మధ్య సహకారం అవసరమని పేర్కొన్నారు. అర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ మోదీ భేటీ అయ్యారు. రక్షణ, ఆర్థికం, ఔషధాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్య రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచే అంశాలపై చర్చించారు. పశ్చిమాసియాలో పరిస్థితితో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. అర్మేనియాతో సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు. తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ భేటీ కానున్నారు. కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ఆరో ప్రపంచ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవంలోనూ మోదీ పాల్గొననున్నారు.

## విజయ్.. ఐరాస చీఫ్ కూడా అవుతారేమో!.. డీఎంకే ఎద్దేవా



తమిళనాడు సీఎం విజయ్‌ను 2029 ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థి గా టీవీకే పార్టీ ప్రచారం చేస్తుండడం అక్కడి రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రచారాలపై ప్రతిపక్ష డీఎంకే పార్టీ విమర్శలు గుప్పిస్తుండగా.. మిత్రపక్షమైన కాంగ్రెస్ సైతం వ్యతిరేకిస్తోంది. అసలేమైందంటే? టీవీకే సీనియర్ నేత, రెవెన్యూశాఖ మంత్రి కె.ఎ.సెంగోట్టైయన్ ఇటీవల తిరుప్పూర్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ తాను ఎంజీఆర్, జయలలితతో కలిసి పనిచేశానని, విజయ్ (CM Vijay) వారికి మించిన శక్తిగా ఉన్నారంటూ కొనియాడారు. ఆయన తమిళనాడుకే పరిమితం కారని, దేశాన్ని సైతం పాలిస్తారని వ్యాఖ్యానించారు. ఇటీవల టీవీకే (TVK) చేసిన ఓ సర్వేలోనూ మోదీ, రాహుల్ గాంధీ తర్వాత ప్రధాని అయ్యే అవకాశం విజయ్‌కు ఉందని తేలింది. దీంతో టీవీకే నేతలు విజయ్‌ను భావి ప్రధానిగా అభివర్ణిస్తున్నారు. దీనిపై డీఎంకే కార్యదర్శి భారతి స్పందిస్తూ.. ఊహించుకోవడానికి హద్దుల్లేవు గనక వారు ఏమైనా అనుకుంటారంటూ విమర్శలు గుప్పించారు. విజయ్‌ను ఐరాస అధిపతిని చేస్తామని కూడా అంటారేమో అని ఎద్దేవా చేశారు. టీవీకే ప్రచారాన్ని కాంగ్రెస్ సైతం తప్పుబట్టింది. 2029 ఎన్నికల్లో తమ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని అభ్యర్థిగా నిలబడతారని.. టీవీకే ఆయనకు మద్దతు ఇవ్వకపోతే తమిళనాడు మంత్రివర్గం నుంచి వైదొలుగుతామని సీనియర్ నేత మాణికం ఠాగూర్ హెచ్చరించారు. ప్రతి సర్వే ప్రజాభిప్రాయాలను ప్రతిబింబించదని పేర్కొన్నారు. 2029 సార్వత్రిక ఎన్నికల విషయంలో తమ పార్టీకి స్పష్టమైన ప్రణాళిక ఉందన్నారు. విజయ్‌కు మిత్రపక్షంగా ఉన్న ఎండీఎంకే సైతం ఈ వార్తలను వ్యతిరేకించింది. ఇండియా కూటమి తరఫున ప్రధాన మంత్రి అభ్యర్థిగా రాహుల్ గాంధీ మాత్రమే ఉంటారని తెలిపింది. ప్రధాని కావాలని విజయ్ ఆశిస్తారని కూడా తాము అనుకోవట్లేదని పేర్కొంది. ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేయొద్దని టీవీకే నేతలకు సూచించింది.

## హరియాణాలో సింగర్ హత్య.. ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు షూటర్లు మృతి



హరియాణాకు చెందిన ప్రముఖ గాయకుడు, యూట్యూబర్, నటుడు అంకిత్ బాల్యన్ హత్య కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఇద్దరు షార్ప్ షూటర్లు సోమవారం పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. సోమవారం తెల్లవారుజామున ఉత్తరప్రదేశ్‌లో షామ్లీ పరిధిలోని కైరానా రోడ్డు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హరియాణాలోని సోనేపట్‌కు చెందిన మోహిత్ (22), సుమిత్ (24) అనే ఇద్దరు షూటర్లు కైరానా ప్రాంతంలో ప్రయాణిస్తుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. తప్పించుకునే క్రమంలో పోలీసులపై నిందితులు కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు కూడా వారిపై కాల్పులు జరపడంతో.. నిందితులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ప్రాణాలు కోల్పోయారు. నిందితులు మోహిత్, సుమిత్ తలలపై గతంలో రూ.50 వేలు చొప్పున రివార్డు కూడా ఉంది. ఆగస్టు 26న సాయంత్రం అంకిత్ బాల్యన్ దారుణ హత్యకు గురయ్యారు. ఉత్తరప్రదేశ్ షామ్లీ జిల్లాలో ఓ జిమ్ బయట అంకిత్‌ను దుండగులు అత్యంత దారుణంగా కాల్చి చంపారు. జిమ్ నుంచి బయటకు వస్తున్న అతడిపై 18 రౌండ్ల కాల్పులు జరపడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన జరిగిన కొద్ది గంటల్లోనే అంకిత్ హత్య తమ పనేనంటూ 'జితేందర్ మన్ గోగి గ్యాంగ్' సోషల్ మీడియా వేదికగా ప్రకటించుకోవడం తీవ్ర చర్చనీయాశంగా మారిన విషయం తెలిసిందే.

## రాష్ట్రపతి వద్ద విధులు.. 12 ఏళ్లకే రిటైర్మెంట్: ఎవరీ మేజర్ రిషభ్..?

రాష్ట్రపతి 'ఎయిడ్‌డిక్యాంప్' మేజర్ రిషభ్ సింగ్ సాంబ్యాల్ అంటే వెంటనే అందరూ గుర్తించకపోవచ్చు. కానీ ద్రౌపదీ ముర్ము అధికారిక కార్యక్రమాలు, పర్యటనల్లో ఆమె పక్కన కనిపించే ఆర్మీ అధికారి అనగానే వెంటనే గుర్తుపడతారు. సోషల్ మీడియాలో ఆయనకు ఉన్న క్రేజ్ అలాంటిది. తాజాగా ఆయన ముందస్తు పదవీ విరమణ చేయడం చర్చనీయాంశమైంది. 12 ఏళ్లపాటు సైన్యంలో పని చేసిన రిషభ్.. వ్యక్తిగత కారణాలతో ఆర్మీని వీడినట్లు పేర్కొన్నారు.

**ఎన్‌డీఏ నుంచి రాష్ట్రపతి భవన్‌కు..**

32ఏళ్ల రిషభ్ 2014లో నేషనల్ డిఫెన్స్ అకాడమీ (NDA)లో చేరారు. మిలిటరీ స్టడీస్, డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అభ్యసించారు. '4 పారా స్పెషల్ ఫోర్సెస్'లో పనిచేశారు. ఇందులో ప్రఖ్యాత 'బలిదాన్ బ్యాడ్జ్'ను పొందారు. 2021 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కెప్టెన్‌గా 'జాట్ రెజిమెంట్' దళానికి నాయకత్వం వహించారు. ఆ ఏడాది జాట్ రెజిమెంట్ ఉత్తమ మార్చింగ్ కంటింజెంట్ ట్రోఫీని గెలుచుకోవడంతో రిషభ్ సింగ్ పేరు మార్మోగింది. అనంతరం 2023లో ఆయన రాష్ట్రపతి ఏడీసీగా ఎంపికయ్యారు. అప్పటి నుంచి ఆయన కెరీర్ కీలక మలుపు తిరిగింది. రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాల్లో తరచూ కన్పించడం, ప్రొటోకాల్‌కు అనుగుణంగా భద్రతా విధులను సమర్థంగా నిర్వర్తించడంతో ఆ మధ్య సామాజిక మాధ్యమాల్లో రిషభ్ వైరల్‌గా మారారు. నెటిజన్లు ఆయనకు 'నేషనల్ క్రష్' అనే ట్యాగ్‌ను కూడా ఇచ్చారు. ఇప్పుడు ఉన్నట్టుండి ఆయన పదవి నుంచి వైదొలగడం నెట్టింట చర్చకు దారితీసింది. రిషభ్ రిటైర్మెంట్‌పై రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి వివరణ రాలేదు. అయితే, వ్యక్తిగత, కుటుంబపరమైన బాధ్యతల కారణంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.




# ప్రతి మూడేళ్లకు రూ.లక్ష కోట్ల వ్యాపారం పెంచుతాం

బ్యాంక్ వ్యాపారాన్ని ప్రతి మూడేళ్లకు రూ.లక్ష కోట్ల మేర పెంచాలనే లక్ష్యంతో ఉన్నామని కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) బి.రమేశ్‌బాబు చెప్పారు. ప్రస్తుతం దేశంలో 919 శాఖలుండగా, ఏడాది వ్యవధిలో 1,000 శాఖలు చేస్తామని.. ఇందులో తెలుగు రాష్ట్రాల్లోనే 35 వరకు కొత్తగా ప్రారంభిస్తామని 'ఈనాడు' ఇంటర్వ్యూలో చెప్పారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో శాఖను సోమవారం ప్రత్యక్షంగా ప్రారంభించిన ఆయన, దేశంలోని వివిధ ప్రాంతాల్లో మరో 15 శాఖలను దృశ్యమాధ్యమ పద్ధతిలో ఆవిష్కరించారు. అనంతరం బ్యాంక్ లక్ష్యాలను వివరించారు. ముఖ్యాంశాలివీ..

**కొత్త శాఖలు ఎందుకంటే**

సోమవారం 16 శాఖలు ప్రారంభించాం. ఇందులో తెలంగాణలో ఇంద్రేశం, గచ్చిబౌలి, కోకాపేట; ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ (రామవరప్పాడు), జగ్గయ్యపేట, సోంపేట, విశాఖపట్నం (కంచరపాలెం), రాజమండ్రి (కొంతమూరు) ఉన్నాయి. ఇవికాక తమిళనాడులో 6, కర్ణాటకలో 1, దిల్లీలో 1 ప్రారంభించాం. వీటితో కలిపి మా శాఖల సంఖ్య 919కి చేరింది. ఏడాది వ్యవధిలో శాఖల సంఖ్యను 1,000కి చేరుస్తాం. వచ్చే ఏడాది కాలంలో మరో 3035 శాఖలు తెలుగు రాష్ట్రాల్లో నెలకొల్పుతాం. తెలంగాణాలోని 33 జిల్లాల్లో 24 జిల్లాల్లోనే మా శాఖలున్నాయి. అందుకే తొలుత తెలుగు రాష్ట్రాల్లోనే విస్తరణకు చోటుంది. మా లావాదేవీల్లో 98% డిజిటల్‌గా జరుగుతున్నా, శాఖల్లో కార్యకలాపాలు సాగించడం సౌలభ్యంగా భావించే వారి కోసం, వారితో అనుబంధాన్ని బలోపేతం చేసేందుకే శాఖలు ఏర్పాటు చేస్తున్నాం.

**రుణాల విషయంలో అత్యంత జాగ్రత్త**

రిటెయిల్ ఖాతాదార్లతో పాటు ఎంఎస్ఎంఈలు, వ్యవసాయ రంగాలకు సేవలు అందించడంపైనే



దృష్టి సారించాం. రుణాల జారీలో అత్యంత అప్రమత్తంగా ఉండటం వల్లే ఏప్రిల్-జూన్‌లో నికర నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 0.19 శాతానికి పరిమితం అయ్యాయి. సిబిల్ స్కోర్‌తో పాటు 40, 45 సోర్సెస్ నుంచి సమాచారం సేకరిస్తున్నాం. కృత్రిమమేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) సాంకేతికతనూ వాడుతున్నాం. ఇన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్లే ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.250 కోట్లు ఉండే నికరలాభం రూ.2,500 కోట్లు మించింది. 2026 జూన్ 30 నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.2,27,267 కోట్లకు చేరింది. ఇందులో డిపాజిట్లు రూ.1,22,587 కోట్లు, రుణాలు రూ.1,04,680 కోట్లు ఉన్నాయి. 110 ఏళ్ల చరిత్రలో, కొవిడ్ సమయంలో మినహా ప్రతీ ఏటా వాటాదార్లకు డివిడెండ్ ఇచ్చాం. వ్యాపారం పెంచుకోవడం, ఆస్తుల నాణ్యత అత్యుత్తమంగా ఉండేలా చూడటం, ఖాతాదారుకు మెరుగైన అనుభవం కల్పించడమే మా ధ్యేయం.

**పెద్ద ఫండ్‌లకు విశ్వాసం పెరిగింది**

మా బ్యాంక్ పనితీరుపై విశ్వాసం పెరగడం వల్లే దేశంలోని పెద్ద మ్యూచువల్‌ఫండ్ సంస్థలైన ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్‌లు 9.9% వరకు వాటాలు కొనేందుకు రిజర్వ్ బ్యాంక్ వద్ద అనుమతులు తీసుకున్నాయి. రిటర్న్ ఆన్ అసెట్స్ (ఆర్ఓఏ) 2.11%, రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్ఓఈ) కనీసం 15% ఉండటం ఇందుకు నేపథ్యం. కార్పొరేట్ రుణాల వాటా 45% నుంచి 15% శాతానికి తగ్గితే, ఎంఎస్ఎంఈ రిటెయిల్ వ్యవసాయ రుణాల వాటా 85 శాతానికి చేరింది.

# ఇంటర్నెట్ లేకున్నా.. యూపీఐ చెల్లింపులు

ఫీచర్ ఫోన్ వినియోగదారుల కోసం ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇంటర్నెట్ లేకపోయినా వారు యూపీఐ చెల్లింపులు చేసేందుకు వీలుగా 'UPI 123Pay' సర్వీస్‌ను ఆవిష్కరించింది. దీంతో 20 కోట్ల మందికి పైగా ఫీచర్ ఫోన్ వినియోగదారులు డిజిటల్ చెల్లింపులు చేసేందుకు వీలు కలగనుంది. 2జీ కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో నమ్మకమైన లావాదేవీలు నిర్వహించేందుకు ఎస్ఎంఎస్ ఆధారిత వ్యవస్థను ఈ యూపీఐ 123పే ఉపయోగించుకుంటుంది. ఈ సర్వీస్‌ను విస్తరించేందుకు నోకియా, హెచ్‌ఎండీ, లావా ఇంటర్నేషనల్, ఐటెల్ మొబైల్ సంస్థలతో ఫోన్‌పే భాగస్వామ్యం కుదుర్చుకుంది. ప్రీ బండిల్డ్‌గా.. అంటే ఫోన్ కొనుగోలు చేసేటప్పుడు ఫోన్‌తో




పాటే వస్తుంది. ''స్మార్ట్‌ఫోన్‌లకే పరిమితమైన డిజిటల్ చెల్లింపులు 'UPI 123Pay' సర్వీస్ ద్వారా దేశంలోని ప్రతి మూలకూ విస్తరిస్తాయి'' అని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ అన్నారు. అందరికీ సమానస్థాయిలో సేవలు అందించే ఉద్దేశంతోనే దీనిని తీసుకొచ్చామన్నారు. దీనిద్వారా యూజర్లు వ్యక్తులకు, వ్యాపారులకు చెల్లింపులు చేయొచ్చని పేర్కొన్నారు. కెమెరా కలిగిన ఫీచర్ ఫోన్ వినియోగదారులు స్కాన్ చేసి చెల్లింపులు చేయొచ్చు. కేవలం చెల్లింపులే కాకుండా బ్యాలెన్స్ తనిఖీ చేయడం, లావాదేవీ హిస్టరీ కూడా తెలుసుకోవచ్చు. తొలిసారి ఈ సదుపాయాన్ని వినియోగించే వారి కోసం ఏఐ హెల్ప్‌లైన్‌ను కూడా ఫోన్‌పే అందుబాటులోకి తెచ్చింది. ఇంగ్లిష్‌సహా 12 భారతీయ భాషల్లో ఈ సేవల్ని వినియోగించాలో వివరిస్తుంది. భవిష్యత్‌లో బిల్లు పేమెట్లు, రీఛార్జీ వంటి సేవలనూ అందుబాటులోకి తెస్తామని ఫోన్‌పే తెలిపింది.

# జీఎస్టీ 2.0 లేకుంటే పరిస్థితి ఇంకోలా ఉండేది: మారుతీ సుజుకీ ఛైర్మన్




దిల్లీ: కేంద్ర ప్రభుత్వం గతేడాది తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల ఆటోమొబైల్ ఇండస్ట్రీతో పాటు, అన్ని రంగాలకు ఊతం లభించిందని మారుతీ సుజుకీ ఇండియా ఛైర్మన్ ఆర్‌సీ భార్గవ అన్నారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ఉన్నా.. ఆయా రంగాలు రాణిస్తున్నాయంటే ఈ పన్ను సంస్కరణలే కారణమన్నారు. దీని వల్ల అనిశ్చితి పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైన రక్షణ లభించిందని పేర్కొన్నారు. కంపెనీ వార్షిక సాధారణ సమావేశం సందర్భంగా వాటాదారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రస్తుతం చిన్న కార్ల మార్కెట్ వేగంతో దూసుకెళుతుందన్నారు. గడిచిన ఐదేళ్లలో సాధించిన వృద్ధి కంటే, గతేడాది సెప్టెంబరులో ప్రకటించిన జీఎస్టీ సంస్కరణలు అందుకు ఊతమిచ్చాయని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల కొన్ని సవాళ్లు ఉన్నా.. దేశ ఆర్థిక వ్యవస్థ రాణిస్తోందంటే కారణం జీఎస్టీలో మార్పులే కారణమన్నారు. ఒకవేళ జీఎస్టీపై నిర్ణయం తీసుకోకపోయి ఉంటే.. గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చేదన్నారు. జీఎస్టీ సంస్కరణల అనంతరం ఆటోమొబైల్ పరిశ్రమ గురించి తాను వేసిన అంచనాలు నిజమయ్యాయని ఈ సందర్భంగా భార్గవ పేర్కొన్నారు. సంస్కరణల ఫలాలు కేవలం ఆటోమొబైల్ రంగానికే కాకుండా.. దేశ ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలకూ విస్తరించాయన్నారు. దేశ జీడీపీ అంచనాల కంటే మెరుగ్గా రాణిస్తోందన్నారు. ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అభివృద్ధిని వేగవంతం చేయడానికి, భారత ఆర్థిక వ్యవస్థలో పోటీతత్వాన్ని పెంచడానికి, విస్తృత ఆర్థిక కార్యకలాపాల ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడానికి అవసరమైన సంస్కరణలకు మద్దతు ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు. దేశ బలం దాని ఆర్థిక వ్యవస్థపై ఆధారపడి ఉంటుందని భార్గవ పేర్కొన్నారు.

# రూ.1,27,500 కోట్లతో సెమీకాన్ 2.0

* **నోటిఫై చేసిన కేంద్రం**

దిల్లీ: రూ.1,27,500 కోట్లతో సెమీకాన్ 2.0 పథకాన్ని నోటిఫై చేస్తూ ప్రభుత్వం సోమవారం అమల్లోకి తెచ్చింది. చిప్ తయారీ నుంచి స్వదేశీ డిజైన్, ఐపీ పరికరాలు, మెటీరియల్స్, అధునాతన ప్యాకేజింగ్, ఆర్ అండ్ డీ, నైపుణ్యాభివృద్ధి వంటివి ఉండే ఫుల్‌స్టాక్ ఎకోసిస్టమ్ వరకు మన దేశ సెమీ కండక్టర్ ఆశయాలను మరింత పెంపొందించడం దీని లక్ష్యంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా సెమీకండక్టర్లు ఒక కీలకమైన వ్యూహాత్మక వనరుగా మారిన తరుణంలో ఈ అడుగులు పడ్డాయి. ఎందుకంటే: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో వస్తున్న విప్లవం అధునాతన చిప్‌లు, మెమొరీకి భారీ గిరాకీని సృష్టిస్తోంది. ఇదే సమయంలో సరఫరా చైన్‌లోని బలహీనతలపై పెరుగుతున్న ఆందోళనలు, మారుతున్న భౌగోళిక రాజకీయాలు, ప్రపంచ స్థాయి



సంస్థలను తమ సెమీకండక్టర్ సామర్థ్యాలను విస్తరించుకోవడానికి, కేంద్రీకృత ఉత్పత్తి కేంద్రాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి పురికొల్పాయి. అందుకు తగ్గట్లుగా కేంద్ర మంత్రి వర్గం 2026 జులై 15న సెమీకాన్ 2.0 పథకానికి ఆమోదం తెలిపింది.

# తిలక్ అజేయ శతకం

బెంగళూరు: దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో తిలక్ వర్మ (106 బ్యాటింగ్; 225 బంతుల్లో 7×4) అదిరే శతకం సాధించాడు. నార్త్‌తో మ్యాచ్‌లో అతడు.. శ్రేయస్ గోపాల్ (87; 169 బంతుల్లో 11×4)తో కలిసి ఆరో వికెట్‌కు 175 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు విలువైన ఆధిక్యం అందించాడు. రెండో రోజు ఆట ఆఖరికి సౌత్ 285/9తో నిలిచింది. తిలక్‌కు తోడు కావురి సాయితేజ (0) క్రీజులో ఉన్నాడు. సౌత్ 90 పరుగుల ఆధిక్యంలో ఉంది. 40/2తో సోమవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్ జోన్‌ను గుర్నూర్ బ్రార్ (4/70) దెబ్బ తీశాడు. అతడి ధాటికి తిలక్ బృందం 80కే 5 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో తిలక్ పట్టుదలతో ఆడాడు. సీనియర్ ప్లేయర్ గోపాల్‌తో కలిసి కీలక భాగస్వామ్యంతో జట్టును మెరుగైన స్థితిలో (255/5) నిలిపాడు. అయితే సౌత్ 15 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు చేజార్చుకుని, భారీ స్కోరు ఆధిక్యం సాధించే అవకాశాన్ని కోల్పోయింది. అన్షుల్ కంబోజ్, అర్షదీప్ సింగ్ రెండేసి వికెట్లు తీశారు. హైదరాబాద్ ఆటగాళ్లు కొడిమెల హిమతేజ (0), తనయ్ త్యాగరాజన్ (6) నిరాశపరిచారు.

వైభవ్ త్రుటిలో..: యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. అరుదైన ఘనతను అందుకునే అవకాశాన్ని త్రుటిలో కోల్పోయాడు. సెంట్రల్ జోన్‌తో రెండో సెమీస్‌లో సూర్యవంశీ (92; 81 బంతుల్లో 7×4, 7×6) సెంచరీ ముంగిట ఔటయ్యాడు. అతడు వంద పూర్తి చేసుంటే..



దిగ్గజ ఆటగాడు సచిన్ తెందుల్కర్ ఘనతను అధిగమించేవాడు. ధ్రువ్ పండోవ్ (14 ఏళ్ల 293 రోజులు) భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో ఫస్ట్‌క్లాస్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పగా.. సచిన్ (15 ఏళ్ల 230 రోజులు) రెండో స్థానంలో ఉన్నాడు. వైభవ్ సోమవారం సెంచరీ కొట్టి ఉంటే 15 ఏళ్ల 157 రోజులకే ఈ ఘనత అందుకుని సచిన్‌ను దాటేవాడు. సెంట్రల్‌తో మ్యాచ్‌లో రెండో రోజు ఉదయం బ్యాటింగ్‌కు వచ్చిన ఈస్ట్ 266కు ఆలౌటైంది. వైభవ్, మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (69) కలిసి ఇచ్చిన అదిరే ఆరంభాన్ని



ఈస్ట్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఈ జంట తొలి వికెట్‌కు 161 పరుగులు జోడించింది. అయితే వైభవ్ ఔటయ్యాక కథ అడ్డం తిరిగింది. హర్ష్ దూబె (4/66), యశ్ ఠాకూర్ (3/66), అర్యన్ పాండే (3/43) విజృంభించడంతో.. ఈస్ట్ 105 పరుగుల వ్యవధిలో 10 వికెట్లు చేజార్చుకుని సరిగ్గా ప్రత్యర్థి చేసిన స్కోరుకే (266) పరిమితమైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన సెంట్రల్.. ముకేశ్ కుమార్ (2/14), మహ్మద్ షమి (1/13) ధాటికి తడబడి.. ఆట చివరికి 45/3తో నిలిచింది. రజత్ పాటీదార్ (5) మరోసారి విఫలమయ్యాడు.




# '25' ఇక కలేనా!

ఒకప్పుడు రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్‌లతో కలిసి టెన్నిస్ ప్రపంచాన్ని ఏలిన జకోవిచ్‌కు ఇప్పుడు కష్ట కాలం నడుస్తోంది. వయసు మీద పడింది. గాయాలు వెంటాడుతున్నాయి. మునుపటి ఫామ్ లేదు. సర్క్యూట్‌లోకి కొత్త కుర్రాళ్లు వచ్చేశారు. సినర్, అల్కరాస్ లాంటి వాళ్లు టైటిల్‌కు అతడికి మధ్య గోడలా నిలుస్తున్నారు. కొత్త కుర్రాళ్లు సైతం 39 ఏళ్ల నొవాక్‌ను తేలిగ్గా ఓడిస్తున్నారు. 2023 సెప్టెంబర్‌లో మెద్వెదెవ్‌పై గెలిచి యుఎస్ ఓపెన్ సాధించాడు జకోవిచ్. ఇది అతడి కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్. అక్కడి నుంచి మరో టైటిల్ కోసం అతడు చేయని పోరాటం లేదు. అయితే ఫిట్‌నెస్ సమస్యలు అతడిని ప్రతి దశలోనూ అడ్డుకున్నాయి. 2024లో వింబుల్డన్‌లో మాత్రమే ఫైనల్ చేరుకోగలిగాడు. అల్కరాస్‌ను దాటలేకపోయాడు. ఆ ఏడాది అదే నొవాక్‌కు ఉత్తమ ప్రదర్శన. గత సంవత్సరం కాస్త స్థిరంగానే ఆడాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్, ఫ్రెంచ్ ఓపెన్, యుఎస్ ఓపెన్లలో సెమీఫైనల్లో అడుగుపెట్టాడు. మూడు టోర్నీల్లో సినర్ లేదా అల్కరాస్ అతడికి అడ్డుపడ్డారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో మాత్రం గాయమే ఈ సెర్బియా యోధుడికి శత్రువైంది. ఒకప్పుడు ప్రత్యర్థులను తన టెక్నిక్, అనుభవంతో పాటు మానసికంగా ఇబ్బందిపెడుతూ దెబ్బ తీసేవాడు నొవాక్. ఇప్పుడు ఆ ఆయుధాలేమీ అతడికి పని చేయట్లేదు. వయసు మీద పడడం, పూర్తి ఫిట్‌గా లేకపోవడం ఒక కారణమైతే.. కొత్త కుర్రాళ్లు రెట్టించిన ఉత్సాహంతో దూసుకొస్తుండడం మరో కారణం. వరుస ఓటములు చవిచూస్తుండడంతో ఫెదరర్, నాదల్ ఇప్పటికే రిటైర్ అయ్యారు. జకోవిచ్ మాత్రం అలుపెరగకుండా పోరాడుతున్నా అనుకున్న ఫలితాలు మాత్రం




సాధించలేకపోతున్నాడు.

ప్రస్తుతం జకోవిచ్ ఫామ్ చూస్తుంటే మరో టైటిల్ సాధించడం, 25వ ట్రోఫీ కల నెరవేర్చుకోవడం దాదాపు అసాధ్యంగానే కనిపిస్తోంది. గతంలో అమెరికా దిగ్గజం సెరెనా విలియమ్స్ ఇలాగే కెరీర్ చివర్లో టైటిల్ కోసం ఎన్నో ప్రయత్నాలు చేసింది. జకోవిచ్ కంటే ఒకటి తక్కువగా సెరెనా 23 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ ట్రోఫీలు సాధించింది. మరో టైటిల్ గెలిచి మార్గరెట్ కోర్ట్‌ను సమం చేయాలని ఈ అమెరికా తార ఎంతో పరితపించింది. గాయాలు, ఫామ్ కోల్పోవడం లాంటి కారణాలు ఆమెకు అడ్డంకిగా మారాయి. ఇప్పుడు జకోవిచ్ ఎలా యువ ఆటగాళ్ల చేతుల్లో ఓడిపోయాడో.. సెరెనా కూడా అప్పట్లో అనామక ప్లేయర్ల చేతిలో పరాజయాలు చవిచూసింది. ఇక నా వల్ల కాదన్నట్టు కన్నీళ్లు పెట్టుకుని నిష్క్రమించింది. ఇప్పుడు జకోవిచ్‌ను కూడా చూస్తే ఆమె బాటలోనే వెళ్తున్నట్లు కనిపిస్తున్నాడు. ఈ సీజన్ చివరి టోర్నీ యుఎస్ ఓపెన్ తొలి రౌండ్లో నవోన్ (అర్జెంటీనా) చేతిలో ఓడాక.. నొవాక్ కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ ఓటమిని అతడు అసలు ఊహించలేదు. తనకు ప్రధాన అడ్డంకిగా ఉన్న యానిక్ సినర్ గాయంతో యుఎస్ ఓపెన్ నుంచి వైదొలిగాడు. మరో ప్రత్యర్థి అల్కరాస్.. నాలుగు నెలల విరామం తర్వాత గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడుతున్నాడు.

# మెస్సి టాటా.. అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైరైన స్టార్

ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సిని మళ్లీ ప్రపంచకప్‌లో చూడలేం. తన ఆటతో రెండు దశాబ్దాలపాటు అభిమానులను ఉర్రూతలూగించిన ఈ మాంత్రికుడు.. అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైరయ్యాడు. ఇకపై అర్జెంటీనాకు ఆడనని ప్రకటించాడు. బ్యూనోస్ ఐరెస్: అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ఓ గొప్ప అధ్యాయం ముగిసింది. మేటి ఆటగాడు మెస్సి రిటైరయ్యాడు. అర్జెంటీనా జట్టుకు గుడ్‌బై చెబుతున్నట్లు అతడు శనివారం తెలిపాడు. ''ఈ నిర్ణయం ఎంతో బాధిస్తుంది. కానీ రిటైర్ కావాల్సిన సమయం వచ్చేసింది. నేను ఎప్పుడు బరిలోకి దిగినా సర్వశక్తులూ ఒడ్డా. ఈ జెర్సీ కోసం మైదానంలో ఎంతో పోరాడా. మీకు ఆనందాన్నివ్వడం, అర్జెంటీనా పౌరులుగా మీరు గర్వపడేలా చేయడం కోసమే ఇదంతా'' అని ఓ సోషల్ మీడియా పోస్ట్‌లో 39 ఏళ్ల మెస్సి పేర్కొన్నాడు. జూన్ 21నే రిటైర్మెంట్ లేఖ రాశానని, తన తండ్రి అనారోగ్యం కారణంగా పోస్ట్ చేయలేకపోయానని మెస్సి చెప్పాడు. అతడి తండ్రి జోర్జ్.. ఆగస్టు 8న కన్నుమూశారు. మెస్సి అర్జెంటీనా తరఫున 2006లో అరంగేట్రం చేశాడు. 2022లో ప్రపంచకప్పును అందుకున్నాడు. 20 ఏళ్ల పాటు తనకు మద్దతుగా నిలిచిన అభిమానులకు మెస్సి కృతజ్ఞతలు తెలిపాడు. 207 మ్యాచ్‌లు 125 గోల్స్: మెస్సి తన రెండు దశాబ్దాల కెరీర్‌లో 207 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. 125 గోల్స్ కొట్టాడు. 2006లో తన తొలి గోల్ (క్రొయేషియాపై) సాధించాడు. 2026 ప్రపంచకప్‌లో ఈజిప్ట్‌పై కొట్టిందే.. మెస్సి చివరి అంతర్జాతీయ గోల్. అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాళ్ల జాబితాలో రొనాల్డో (233 మ్యాచ్‌ల్లో 146 గోల్స్) తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు. అర్జెంటీనాకు గుడ్‌బై చెప్పినప్పటికీ మెస్సి.. క్లబ్ ఫుట్‌బాల్‌లో కొనసాగనున్నాడు. అతడు ప్రస్తుతం మేజర్ లీగ్ సాకర్ క్లబ్ ఇంటర్ మయామి కెప్టెన్. ఇటీవల ముగిసిన ప్రపంచకప్‌లో మెస్సి.. 8 మ్యాచ్‌ల్లో ఆరు గోల్స్ కొట్టాడు. రికార్డు




స్థాయిలో ఆరు ప్రపంచకప్‌లు ఆడిన అతడు.. 2022లో అర్జెంటీనా కప్పు గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రపంచకప్పుల్లో అతడు మొత్తం 21 గోల్స్ కొట్టాడు. మెస్సి గతంలో ఓసారి అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైరవుతున్నట్లు ప్రకటించాడు. 2016 కోపా అమెరికా ఫైనల్లో నేపథ్యంలో వీడ్కోలు పలికిన అతడు.. త్వరగానే తిరిగొచ్చాడు.




## కయదును బ్యాన్ చేయాలి..

# ఫ్యాన్స్ ఫైర్

హీరోయిన్ కయదు లోహర్‌పై తమిళ ఫ్యాన్స్ ఫైర్ అవుతోన్నారు. ఈ డ్రాగన్ బ్యూటీ హీరోయిన్‌గా నటించిన మలయాళ మూవీ ఐ యామ్ గేమ్, తమిళ సినిమా ఇమ్మోర్టల్ సెప్టెంబర్ 3న రిలీజ్ అవుతున్నాయి. ఇమ్మోర్టల్ ప్రమోషన్స్‌కు దూరంగా ఉంటూ ఐ యామ్ గేమ్ ప్రమోషన్స్‌లో యాక్టివ్‌గా పాల్గొంటోంది. కయదుకు క్రేజ్, స్టార్‌డమ్ లేని టైమ్‌లో హీరోయిన్‌గా ఆమెకు ఇమ్మోర్టల్ దర్శక నిర్మాతలు అవకాశమిచ్చారని, అదే సినిమా ప్రమోషన్స్‌కు దూరంగా ఉండటం కరెక్ట్ కాదని ఫ్యాన్స్ అంటున్నారు. తమిళ సినిమాలే ఆమెకు పేరు తెచ్చిపెట్టాయని కామెంట్లు పెడుతున్నారు. ఒకటి, రెండు విజయాలు దక్కగానే గర్వం తలకెక్కిందని, కోలీవుడ్ ఇండస్ట్రీ ఆమెను బ్యాన్ చేయాలని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. కాగా ఈ వివాదంపై జీవీ ప్రకాష్ రియాక్ట్ అవుతూ ఇమ్మోర్టల్ ఈవెంట్‌కు ఎందుకు అటెండ్ కాలేదో ఆమెనే అడిగితే బెటర్ అన్నాడు.



# సెట్స్‌లో కాలు పెట్టిన రశ్మిక

గాయం నుంచి కోలుకున్న రశ్మిక మందన్న దాదాపు నెల రోజుల గ్యాప్ తర్వాత సినిమా సెట్స్‌లో అడుగుపెట్టింది. భర్త విజయ్ దేవరకొండతో కలిసి సోమవారం రణబాలి షూటింగ్‌లో తిరిగి కాలు పెట్టింది. విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తోన్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. గాయం కారణంగా రష్మిక, విజయ్ కాంబినేషన్‌లో చిత్రీకరించాల్సిన కొన్ని కీలక సన్నివేశాలు ఆగిపోయాయి. వాటిని షూట్ చేస్తున్నట్లు సమాచారం. పెళ్లి తర్వాత విజయ్, రశ్మిక జంటగా నటిస్తున్న తొలి సినిమా ఇది. దసరా కానుకగా అక్టోబర్ 16న రణబాలి థియేటర్లలోకి రాబోతుంది. ఈ మూవీకి టాక్సీవాలా ఫేమ్ రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది.



# హతఃతో హీరోయిన్‌గా ఎంట్రీ

బిగ్‌బాస్ తెలుగు సీజన్ 9 రన్నరప్ తనూజ హారర్ మూవీతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వబోతుంది. ఈ హారర్ సినిమాకు హతః అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సోమవారం టైటిల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ఈ వీడియో గ్లింప్స్‌లో హీరోహీరోయిన్లను చూపించలేదు. తనూజ రోల్ ఏమిటన్నది మేకర్స్ రివీల్ చేయలేదు. అయితే పిల్లి బతికి ఉందా? చనిపోయిందా? అంటూ ఈ వీడియోలో కనిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. తెలుగులో తెరపై ఇప్పటివరకు వచ్చిన హారర్ సినిమాలకు భిన్నమైన కాన్సెప్ట్‌తో ఈ మూవీ రూపొందుతోన్నట్లు సమాచారం. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే పార్ట్ టైమర్స్ అనే వెబ్‌సిరీస్ చేసింది తనూజ. ఇండిపెండెంట్ బిజినెస్‌ఉమెన్స్‌గా రాణించాలని కలలు కన్న ఇద్దరు యువత జీవన ప్రయాణంతో రూపొందిన ఈ వెబ్‌సిరీస్ జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది.





# మా ప్రేమ నిజమే

బలగం హీరోయిన్ కావ్య కళ్యాణ్ రామ్‌తో కీరవాణి కొడుకు కాళ భైరవ ప్రేమలో ఉన్నట్లుగా చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. ఎట్టకేలకు ఈ జంట తమ లవ్‌స్టోరీని కన్ఫామ్ చేశారు. ఇన్‌స్టా ద్వారా తమ బంధాన్ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ మేరకు కావ్య, కాళభైరవ వేర్వేరుగా తమ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. "నీతో సమయాన్ని గడపటం అంటే కొండల మీద కూర్చొని పారుతోన్న సేలయేరును చూస్తున్నట్లుగా అనిపిస్తుందని.. మనమిద్దరం జీవితాంతం కలిసి ఉండబోతున్నామని అందరికి చెప్పడానికి ఉత్సాహంగా ఎదరుచూస్తున్నా అంటూ కాల భైరవ ఓ పోస్ట్ పెట్టాడు. ఇప్పుడు వీరిద్దరి పోస్ట్‌లు వైరల్ అవుతున్నాయి.



# లవ్ రూమర్స్ వేళ కెనీషాకు అవకాశం

కోలీవుడ్ హీరో జయం రవి, సింగర్ కెనీషా డేటింగ్‌లో ఉన్నట్లు కొన్నాళ్లుగా కోలీవుడ్ కోడై కూస్తోంది. కెనీషాతో ప్రేమాయణం కారణంగానే తన భార్య ఆర్తికి విడాకులు ఇవ్వడానికి సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. అయితే జయం రవి తన డెబ్యూ మూవీలో సింగర్ కెనీషాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా అవకాశం ఇవ్వడంతో ఆమె పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి సాంగ్స్ కంపోజింగ్, రీరికార్డింగ్ పనులు పూర్తయ్యాయట. త్వరలోనే కెనీషా పేరును మ్యూజిక్ డైరెక్టర్‌గా జయం రవి అఫీషియల్‌గా అనౌన్స్ చేయబోతున్నారట. ఎన్ ఆర్డినరీ మ్యాన్ సినిమాను స్వయంగా నిర్మిస్తూ డైరెక్టర్‌గా కూడా ఈ మూవీతోనే అరంగేట్రం చేస్తున్నాడు జయం రవి.